PRGI Reg No -“APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి....



ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి 01, సంచిక 141, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, శనివారం - 11 - జూలై - 2026 , వెల రూ.5/-

## ఈ20 పెట్రోల్‌తో మైలేజ్ 3-5% తగ్గొచ్చు..
## కానీ లాభాలు ఎన్నో: కేంద్రం




ఢిల్లీ: ఈ20 (20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్) వినియోగంతో కొన్ని వాహనాల్లో మైలేజ్ 3-5 శాతం వరకు తగ్గే అవకాశం ఉందని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ తెలిపింది. అయితే మైలేజ్‌ను మాత్రమే ప్రమాణంగా చూడకూడదని, ఈ20 వల్ల అనేక కీలక ప్రయోజనాలు లభిస్తాయని స్పష్టం చేసింది.

## ఎల్ నినో పంజా.. రుతుపవనాల పరుగుకు బ్రేక్!
### రుతుపవనాలు మళ్లీ బలహీనపడే సూచనలు




**దేశంలో వర్షపాతం లోటు తీవ్రంగా పెరిగింది**

ఢిల్లీ: దేశవ్యాప్తంగా వర్షాల లోటును పూడ్చుతూ వరుసగా తొమ్మిది రోజుల పాటు సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైనప్పటికీ.. రుతుపవనాలు మళ్లీ బలహీనపడే సూచనలు కనిపిస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావం కారణంగా నైరుతి రుతుపవనాల జోరుకు బ్రేక్ పడే అవకాశాలు ఉన్నాయని

## నా నోరు మూయించాలంటే.. నన్ను చంపాలి
### - బీజేపీపై మమత ఫైర్




అభిషేక్, మహువా, కల్యాణ్ బెనర్జీలను లక్ష్యంగా చేసుకున్నారని మమత ఆరోపణ

2026 బెంగాల్ ఎన్నికల్లో బీజేపీ ఓట్లను దోచుకుని అధికారంలోకి వచ్చిందని విమర్శ

టీఎంసీ నేతల ఫిరాయింపుల మధ్య వీడియో సందేశం విడుదల చేసిన మమత

# కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తాన్ని తప్పుబట్టడం సరికాదు: ఈటల

★ నాకు తెలంగాణే మొదటి ప్రాధాన్యం.. ఆ తర్వాతే పార్టీ అన్న ఈటల

★ ప్రభుత్వం వెంటనే మోటార్లు ఆన్ చేసి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్

★ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని తప్పుబట్టడం దుర్మార్గమని కాంగ్రెస్‌పై విమర్శలు




# సోషల్ మీడియా దుర్వినియోగంపై ఉక్కుపాదం...
# చంద్రబాబు కేబినెట్ కీలక నిర్ణయాలు !

➤ సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ భేటీ

➤ కీలక నిర్ణయాలకు ఆమోదం

➤ సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టేందుకు రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు

➤ రూ.31,431 కోట్ల విలువైన పెట్టుబడులకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం

➤ అమరావతిలో భూములిచ్చిన రైతులకు వార్షిక కౌలు పెంపు.. కీలక నిర్ణయం

➤ ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం మూడు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు

➤ రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు సరికొత్త విధానానికి గ్రీన్ సిగ్నల్




అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన రాష్ట్ర మంత్రి మండలి సమావేశం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. రాష్ట్ర ఆర్థిక ప్రగతి, పెట్టుబడుల ఆకర్షణ, అమరావతి నిర్మాణం, సంక్షేమ పథకాల అమలు, సోషల్ మీడియా నియంత్రణ వంటి అనేక అంశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించింది. సమావేశం అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరాలు వెల్లడించారు. సోషల్ మీడియా దుర్వినియోగాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న ప్రభుత్వం, దానిని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోబోతోందని ఆయన స్పష్టం చేశారు.

సోషల్‌మీడియాదుర్వినియోగంపై ఉక్కుపాదం

సమాజానికి సోషల్ మీడియా దుర్వినియోగం ఒక రోగంలా పరిణమించిందని, దాని వల్ల మేలు కంటే కీడే ఎక్కువగా జరుగుతోందని కేబినెట్ అభిప్రాయపడింది. వ్యక్తిత్వ హననం, ప్రభుత్వాల పై అబద్ధపు ప్రచారం, మహిళలను కించపరచడం వంటివి శ్రుతిమించుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో అనైతిక కార్యకలాపాలను ఏమాత్రం ఉపేక్షించ కూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని మంత్రి పార్థసారథి తెలిపారు. దీని కోసం కొన్ని కీలక చర్యలను కేబినెట్ ఆమోదించిందని వివరించారు.

రాష్ట్ర స్థాయిలో ఒక ‘సోషల్ మీడియా రెస్పాన్స్ సెల్’ ఏర్పాటు.

దుర్వినియోగం, విద్వేష ప్రచారాలను అరికట్టేందుకు ‘రాష్ట్ర స్థాయి టాస్క్‌ఫోర్స్’ ఏర్పాటు.

విద్వేషాలు వ్యాప్తి చేసే హ్యాండిల్స్‌ను గుర్తించడానికి ఆధునిక ఫారెన్సిక్ టూల్స్

# ఆ రోజు పోలీసులే నన్ను తప్పుదోవ పట్టించారు..
# అది పక్కా కుట్ర: కరూర్ ఘటనపై సీఎం విజయ్

❖ కరూర్ తొక్కిసలాట తర్వాత తొలిసారి ఆ జిల్లాకు సీఎం విజయ్

❖ ఘటనకు డీఎంకే, పోలీసులే కారణమంటూ తీవ్ర ఆరోపణలు

❖ నన్ను తప్పుదోవ పట్టించారని, ఇది ఒక కుట్ర అని వ్యాఖ్య

❖ బాధితుల కుటుంబాలకు ఉద్యోగాలివ్వడాన్ని వ్యతిరేకించిన డీఎంకే

❖ ఉద్యోగ నియామకాలకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్, సుప్రీంకోర్టులో డీఎంకేకు చుక్కెదురు






ఢిల్లీ: గతేడాది సెప్టెంబర్‌లో 41 మంది మృతికి కారణమైన కరూర్ తొక్కిసలాట ఘటన తర్వాత తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నేడు తొలిసారిగా ఆ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గత డీఎంకే ప్రభుత్వం, పోలీసులపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల ప్రచార సభకు ముందు జరిగిన ఆ విషాదం వెనుక కుట్ర ఉందని, పోలీసులు తనను తప్పుదోవ పట్టించారని సంచలన ఆరోపణలు చేశారు. ఈ పర్యటనలో ఏర్పాటు చేసిన

## హరీశ్ రావు కాంగ్రెస్‌లోకి వస్తానంటే
## పీఏసీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం: మహేశ్ గౌడ్




పదేళ్లు అధికారంలో ఉన్న హరీశ్ రావు కుంగిపోయే ప్రాజెక్టులు కట్టారన్న మహేశ్ గౌడ్

ఇప్పుడు ప్రభుత్వానికి గడువులు విధించడం హాస్యాస్పదమని వ్యాఖ్య

ఈటల బీఆర్ఎస్ పార్టీకి వత్తాసు పలుకుతున్నట్టుగా ఉందని ఎద్దేవా

## పేదల ఆరోగ్యంతో ఆడుకుంటే ఊరుకోం: చల్లూరు పీహెచ్‌సీ తనిఖీల్లో కౌశిక్ రెడ్డి హెచ్చరిక




● వీణవంక మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కౌశిక్ రెడ్డి ఆకస్మిక తనిఖీలు

● అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆసుపత్రి దారుణంగా తయారయిందని మండిపాటు

● సగం మంది సిబ్బంది డిప్యుటేషన్ పై వేరే ప్రాంతాల్లో పని చేస్తున్నారన్న ఎమ్మెల్యే

# 2028 డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగవు: సీఎం రేవంత్

▶▶ 2029 జూన్‌లో ఎన్నికలు జరుగుతాయని సీఎం జోస్యం

▶▶ అప్పటికీ అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 182కు పెరుగుతాయని వెల్లడి

▶▶ పార్లమెంట్ స్థానాలు 17 నుంచి 25కు పెరుగుతాయని వివరణ

▶▶ జరగబోయే కురుక్షేత్రంలో గెలిచేది మేమే బీఆర్ఎస్‌కు సవాల్

▶▶ కన్నెపల్లి పంప్‌హౌస్‌లు ఆన్ చేస్తే గ్రామాలు కొట్టుకుపోతాయని వెల్లడి




2028 డిసెంబర్‌లో ఎన్నికలు జరగవని, నియోజకవర్గాల పునర్విభజన అనంతరం 2029 జూన్‌లో ఎన్నికలు జరుగుతాయని సీఎం రేవంత్ జోస్యం చెప్పారు. అప్పటికీ అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 182కు, పార్లమెంట్ స్థానాలు 17 నుంచి 25కు పెరుగుతాయని అన్నారు. 182 స్థానాల్లో కనీసం 117 స్థానాల్లో కాంగ్రెస్ గెలిచి రెండోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ 65 సీట్లు గెలుస్తుందని తాము ముందే చెప్పి చేసి చూపించామని గుర్తు చేశారు. ఖమ్మం జిల్లా జగన్నాథపురంలో నిర్వహించిన రైతు ఆశీర్వాద సభలో శుక్రవారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్, ఆ పార్టీ అధినేత కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. “కేసీఆర్ ఇంట్లో ఒకరంటే ఒకరికి పడదు. కల్వకుంట్ల కౌరవ కుటుంబాన్ని పాతాళానికి తొక్కుతాం. పాపాల భైరవుడిని ఫామ్‌హౌస్‌లో బంధించాం. కాచుకో చంద్రశేఖర్ రావు.. జరగబోయే కురుక్షేత్రంలో గెలిచేది మేమే” అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్‌ను మళ్లీ మొలకెత్తనివ్వబోమని ప్రజలు సంకల్పించారని, పదేళ్ల రాక్షస పాలనకు ఇప్పటికే ముగింపు పలికారన్నారు.

## పుంగనూరులో ఈవీ క్లస్టర్..
## ప్రతి 30 కి.మీ.కు ఛార్జింగ్ స్టేషన్: మంత్రి లోకేశ్




★ ఏపీలో ఆటోమోటివ్, ఈవీ ఎకోసిస్టమ్ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

★ పుంగనూరులో ఈవీ క్లస్టర్, గ్రీన్ కారిడార్లలో ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌ను ఆటోమోటివ్, ఎలక్ట్రిక్ వాహన (ఈవీ) రంగంలో దేశానికే హబ్‌గా మార్చేందుకు పటిష్టమైన ప్రణాళికలతో ముందుకెళుతున్నామని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. తమ ప్రభుత్వం తీసుకొచ్చిన “సుస్థిర ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ 4.0” కింద రాష్ట్రంలో విస్తృతమైన ఈవీ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామని, ఈ ప్రయాణంలో భాగస్వాములు కావాలని కొరియన్ సంస్థలను ఆయన ఆహ్వానించారు. దక్షిణ కొరియా పర్యటనలో ఉన్న మంత్రి లోకేశ్, సియోల్‌లో కొరియా ఆటో ఇండస్ట్రీస్ కోఆపరేషన్ ఏజెన్సీ (కేఏఐసీఏ) ఛైర్మన్ టేక్-సుంగ్ లీ నేతృత్వంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఈవీ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈవీ ఎకోసిస్టమ్‌లో భాగంగా పూర్తిస్థాయిలో ఏపీఎస్ఆర్టీసీ బస్సులను విద్యుదీకరించడం, గ్రీన్ కారిడార్లలో ప్రతి 30 కిలోమీటర్లకు ఒక ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయడం, పుంగనూరులో ప్రత్యేక ఈవీ క్లస్టర్‌ను నెలకొల్పడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ-మొబిలిటీ నగరాల అభివృద్ధికి, ఈవీ పరిశోధనలకు

## ఏపీ గవర్నర్‌కు బొత్స లేఖ..



అమరావతి: ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ లేఖ రాశారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూ గురజాడ-విజయనగరం తొలి స్నాతకోత్సవాన్ని విశాఖపట్నంలో నిర్వహించాలన్న నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని బొత్స సత్యనారాయణ తన లేఖలో కోరారు. జేఎన్‌టీయూ గురజాడ తొలి స్నాతకోత్సవంపై బొత్స సత్యనారాయణ స్పందించారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు బొత్స లేఖ రాశారు. ఈ లేఖలో బొత్స.. స్నాతకోత్సవానికి ఆహ్వానం అందించినందుకు గవర్నర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అయితే, విజయనగరం వంటి వెనుకబడిన జిల్లాలో విద్యాభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవాన్ని అదే జిల్లాలో నిర్వహించడం సముచితమని పేర్కొన్నారు. విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో కార్యక్రమం నిర్వహించడం వల్ల విజయనగరం జిల్లా ప్రజల్లో తీవ్ర అసంతృప్తి, నిరసనలు వ్యక్తమవుతున్నాయని లేఖలో తెలిపారు. ఈ నిర్ణయం వల్ల జిల్లా ప్రజల గౌరవం, ఆనందం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. విజయనగర ప్రజల అభిప్రాయాలను గౌరవించి, జేఎన్‌టీయూ గురజాడ తొలి స్నాతకోత్సవాన్ని విజయనగరంలోనే నిర్వహించేలా నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని గవర్నర్‌ను కోరారు. విజయనగరం ప్రజల అసంతృప్తి, నిరసనలను ఈ లేఖ ద్వారా గవర్నర్ దృష్టికి తీసుకువస్తున్నట్లు బొత్స తెలిపారు.

# ఈ20 పెట్రోల్‌తో మైలేజ్ 3-5% తగ్గొచ్చు.. కానీ లాభాలు ఎన్నో: కేంద్రం

మొదటి పేజి తరువాయి

అయితే మైలేజ్‌ను మాత్రమే ప్రమాణంగా చూడకూడదని, ఈ20 వల్ల అనేక కీలక ప్రయోజనాలు లభిస్తాయని స్పష్టం చేసింది. ఈ20 పెట్రోల్‌కు సాధారణ పెట్రోల్‌తో పోలిస్తే అధిక ఆక్టేన్ రేటింగ్, మెరుగైన యాంటీ-నాక్ లక్షణాలు ఉంటాయని పేర్కొంది. దీంతో ఇంజిన్ పనితీరు మెరుగుపడటంతో పాటు వాహనానికి మంచి పికప్, సాఫీ యాక్సిలరేషన్, శుభ్రమైన ఇంజిన్ నిర్వహణ వంటి ప్రయోజనాలు కలుగుతాయని వెల్లడించింది. ఈ20 అమలుకు ముందే ఆటోమొబైల్ తయారీ సంస్థలు, విడిభాగాల తయారీదారులు, పరిశోధనా సంస్థలతో విస్తృతంగా చర్చలు జరిపినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇంజిన్ పనితీరు, ఇంధన వ్యవస్థ, మన్నిక, ఉద్గారాలు, ఇంధన సామర్థ్యం వంటి అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే ఈ20 అమలు చేపట్టినట్లు పేర్కొంది. వాహన తయారీ సంస్థలు పూర్తిగా సంతృప్తి చెందకపోతే ఈ20కు మద్దతు ఇచ్చేవి కాదని, వాహనాల వారంటీలను కూడా కొనసాగించేవి కాదని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ప్రస్తుతం దాదాపు అన్ని కంపెనీలు పాత, కొత్త వాహనాలకు వారంటీ ఇస్తుండటమే దీనికి నిదర్శనమని పేర్కొంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో మారుతీ సుజుకీ 2.84 కోట్ల వాహనాలకు సర్వీసింగ్ చేయగా, అందులో 1.5 కోట్ల పాత ఈ20 సర్టిఫికేషన్ లేని వాహనాలు కూడా ఉన్నాయని తెలిపింది. అయినప్పటికీ ఈ20 కారణంగా తుప్పు పట్టడం, విడిభాగాలు దెబ్బతినడం లేదా అసాధారణ అరుగుదల వంటి సమస్యలు ఏవీ గుర్తించలేదని వెల్లడించింది. హీరో మోటోకార్ప్ కూడా ఇదే తరహా అనుభవాన్ని నివేదించినట్లు తెలిపింది. అలాగే ఈ20 వాడకంతో సూక్ష్మ రేణువుల ఉద్గారాలు చాలా తక్కువగా ఉంటాయని, మొత్తం కార్బన్ ఉద్గారాలు సుమారు 40 శాతం వరకు తగ్గుతాయని కేంద్రం పేర్కొంది. ఇథనాల్ ఉత్పత్తి, నిల్వ, రవాణా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వ రంగ బ్యాంకులు ప్రతి ఏడాది సుమారు రూ.లక్ష కోట్ల మేర పెట్టుబడులకు రుణాలు అందిస్తున్నాయని మంత్రిత్వ శాఖ వెల్లడించింది.


# నా నోరు మూయించాలంటే.. నన్ను చంపాలి - బీజేపీపై మమత ఫైర్

ఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ ఎదుర్కొంటున్న అంతర్గత సంక్షోభం మధ్య ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బీజేపీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తన నోరు మూయించాలంటే తనను చంపాల్సిందేనని వ్యాఖ్యానించారు. పార్టీ నేతలను భయపెట్టేందుకు, వేధించేందుకు బీజేపీ అన్ని ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. వీడియో సందేశం ద్వారా మాట్లాడిన మమతా బెనర్జీ.. టీఎంసీని వీడి బీజేపీలో చేరని వారికి శుభాకాంక్షలు తెలిపారు. తనపై, పార్టీపై ఒత్తిడి తెచ్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపిస్తూ.. "నన్ను మౌనంగా చేయాలంటే నన్ను చంపాల్సిందే. అందుకోసం కూడా మీరు ఎలాంటి ప్రయత్నాలు చేయకుండా వదల్లేదు" అని వ్యాఖ్యానించారు. లోక్‌సభ సభ్యులు అభిషేక్ బెనర్జీ, మహువా మొయిత్రా, కల్యాణ్ బెనర్జీలతో పాటు తన ఇంటిని కూడా లక్ష్యంగా చేసుకున్నారని మమత ఆరోపించారు. తమ పార్టీ నాయకులను నిరంతరం వేధిస్తున్నారని విమర్శించారు. 2026 పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అక్రమాలకు పాల్పడి అధికారంలోకి వచ్చిందని మమత ఆరోపించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియను దుర్వినియోగం చేసి, కేంద్ర బలగాల సహాయంతో కౌంటింగ్ కేంద్రాలను స్వాధీనం చేసుకుని ఎన్నికలను ప్రభావితం చేసిందని విమర్శించారు. దీనికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ ఘోర పరాజయం అనంతరం ఆ పార్టీలో సంక్షోభం మరింత తీవ్రరూపం దాల్చిన విషయం తెలిసిందే. పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు పార్టీని వీడగా, కొందరు పార్టీ నాయకత్వం, ముఖ్యంగా అభిషేక్ బెనర్జీపై విమర్శలు చేశారు. పార్టీలో అవినీతి పెరిగిందని కూడా ఆరోపించారు. మరోవైపు టీఎంసీకి రాజీనామా చేసిన రాజ్యసభ సభ్యులు సుఖేందు శేఖర్ రాయ్, సుష్మితా దేవ్, ప్రకాశ్ చిక్ బరైక్ గురువారం బీజేపీలో చేరారు. అనంతరం జులై 24న జరగనున్న రాజ్యసభ ఉప ఎన్నికలకు బీజేపీ వారిని అభ్యర్థులుగా ప్రకటించింది.

## కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తాన్ని తప్పుబట్టడం సరికాదు: ఈటల

హైదరాబాద్: ప్రజల ప్రయోజనాల విషయంలో తనకు తెలంగాణే మొదటి ప్రాధాన్యమని, ఆ తర్వాతే పార్టీ, వ్యక్తిగత అంశాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. తాను ఎవరో చెప్పినట్లు మాట్లాడే వ్యక్తిని కాదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. సాగునీటి నిర్వహణ, కాళేశ్వరం ప్రాజెక్టు, రైతుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ఎగువ రాష్ట్రాల్లో భారీ వర్షాలతో తెలంగాణ ప్రాజెక్టుల్లోకి నీరు వస్తున్నప్పటికీ ప్రభుత్వం మోటార్లు ఆన్ చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఈటల ఆరోపించారు. వర్షాకాలంలోనూ సాగునీరు అందక రైతులు కష్టాలు పడుతున్నారని, ముఖ్యంగా ఎస్ఆర్ఎస్‌పీ కాల్వల కింద బోర్లు, బావులు లేకుండా వ్యవసాయం చేయడం సాధ్యం కాదని చెప్పారు. తెలంగాణ ఉద్యమం నీళ్లు, నిధులు, ఆత్మగౌరవం కోసమే జరిగిందని ఈటల గుర్తుచేశారు. రాజకీయాలు, సిద్ధాంతాలు వేరైనా మూలాలను మరచిపోవద్దన్నారు. కాళేశ్వరం కంటే ముందే వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జలయజ్ఞం ద్వారా ప్రాణహిత జలాలను తీసుకురావాలనే ప్రణాళిక రూపొందిందని, శ్రీపాద ఎల్లంపల్లి, మిడ్ మానేరు వంటి ప్రాజెక్టులకు అప్పుడే శ్రీకారం చుట్టారని వివరించారు. స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టును అభివృద్ధి చేసి ఎల్లంపల్లికి నీటిని తరలించే వ్యవస్థ ఏర్పాటు చేశారని చెప్పారు. ప్రస్తుతం మిడ్ మానేరు ప్రాజెక్టులో ఉన్న 29 టీఎంసీల నీరు కూడా ఆ ప్రాజెక్టుల ద్వారానే వచ్చిందన్నారు. కాళేశ్వరం వల్లే హుజూరాబాద్‌తో పాటు కరీంనగర్, వరంగల్, నల్గొండ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో రెండు పంటలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కమీషన్లు, డిజైన్ మార్పులపై తాను మాట్లాడడం లేదని, కానీ మొత్తం ప్రాజెక్టునే తప్పుపట్టడం సరికాదని కాంగ్రెస్ నేతలపై మండిపడ్డారు. ప్రాజెక్టు పరిధిలోని దెబ్బతిన్న నిర్మాణాలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని, లేకపోతే రాష్ట్రం తీవ్ర కరవును ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## 2028 డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగవు: సీఎం రేవంత్



మొదటి పేజి తరువాయి

బీఆర్ఎస్‌ను మళ్లీ మొలకెత్తనివ్వబోమని ప్రజలు సంకల్పించారని, పదేళ్ల రాక్షస పాలనకు ఇప్పటికే ముగింపు పలికారన్నారు. మరోవైపు బీఆర్ఎస్‌లో ఉంటారో లేదో హరీశ్ రావే చెప్పాలి అన్నారు. బీజేపీతో మంతనాలు జరపడం లేదా అని ప్రశ్నించారు. రైతు ఆశీర్వాద సభలో భాగంగా 1.44 లక్షల మంది రైతులకు రూ.1,009 కోట్ల రైతు భరోసా నిధులను సీఎం విడుదల చేశారు. కన్నెపల్లి పంప్‌హౌస్‌లను ప్రారంభించాలని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న డిమాండ్‌ను ఆయన తప్పుబట్టారు. అలా చేస్తే భద్రాచలం రామాలయం సహా 44 గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పేటెంట్ అని పేర్కొన్న రేవంత్.. "ఇప్పుడు వైర్లు పట్టుకుంటే కాలి బూడిదైపోతారు" అని వ్యాఖ్యానించారు.

# పుంగనూరులో ఈవీ క్లస్టర్.. ప్రతి 30 కి.మీ.కు ఛార్జింగ్ స్టేషన్: మంత్రి లోకేశ్

మొదటి పేజి తరువాయి



ఈ-మొబిలిటీ నగరాల అభివృద్ధికి, ఈవీ పరిశోధనలకు ప్రత్యేక గ్రాంట్లు అందిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా, ఈవీ బ్యాటరీలు, మాగ్నెట్‌ల తయారీకి అవసరమైన ముడిసరుకుల కోసం కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏపీలో ఒక 'రేర్ ఎర్త్ కారిడార్' ఏర్పాటు చేయబోతున్నట్లు కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే బలమైన ఆటోమోటివ్ పరిశ్రమ ఉందని, చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ పరిధిలో సుమారు 100 కిలోమీటర్ల మేర ఆటోమోటివ్ విడిభాగాల ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామని లోకేశ్ పేర్కొన్నారు. కియా మోటార్స్‌తో పాటు అశోక్ లేలాండ్, ఇసుజు, హీరో మోటోకార్ప్, అమర్ రాజా, అపోలో టైర్స్, భారత్ ఫోర్జ్ వంటి దిగ్గజ సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు సాగిస్తున్నాయని గుర్తుచేశారు. అశోక్ లేలాండ్ సంస్థ సుమారు రూ. 2,500 కోట్ల పెట్టుబడితో లిథియం అయాన్ ఈ-బస్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోందని వెల్లడించారు. "అనంతపురంలో కియా మోటార్స్ సాధించిన అద్భుత విజయమే మా ప్రభుత్వ నిబద్ధతకు, సామర్థ్యానికి నిదర్శనం" అని లోకేశ్ అన్నారు. కొరియా కంపెనీల కోసం ప్రత్యేకంగా రెండు ఆటో కాంపోనెంట్స్ పార్కులను అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. కియా క్లస్టర్ సమీపంలో ఒకటి, శ్రీసిటీ-చిత్తూరు-తిరుపతి కారిడార్‌లో మరొకటి ఏర్పాటు చేస్తామన్నారు. ఈ పార్కులలో ప్లగ్-అండ్-ప్లే షెడ్లు, ఉమ్మడి టెస్టింగ్ సౌకర్యాలు, పూర్తిస్థాయి సపోర్ట్ కోసం ఒక 'కొరియా డెస్క్' కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించేందుకు ఏపీఎస్ఎస్‌డీసీ, కౌశలం ప్లాట్‌ఫామ్ ద్వారా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈవీ పవర్‌ట్రెయిన్‌ల తయారీలో శిక్షణ ఇచ్చేందుకు ఒక అకాడమీని ఏర్పాటు చేయాలని, ఇందుకు రాష్ట్రంలోని 250కి పైగా ఇంజనీరింగ్ కళాశాలల సహకారం తీసుకోవాలని కొరియన్ సంస్థలను కోరారు. ఇరు ప్రాంతాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు ఏపీ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఏపీఈడీబీ)లో ప్రత్యేక కొరియా డెస్క్, ఒక ఉమ్మడి వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు లోకేశ్ ప్రకటించారు.

# ఎల్ నినో పంజా.. రుతుపవనాల పరుగుకు బ్రేక్!

మొదటి పేజి తరువాయి

ఎల్‌నినో ప్రభావం కారణంగా నైరుతి రుతుపవనాల జోరుకు బ్రేక్ పడే అవకాశాలు ఉన్నాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. జూలై మధ్యలో వర్షాలకు విరామం రావచ్చన్న అంచనాలు ఇటీవలే ఖరీఫ్ పంటలు వేసిన రైతుల్లో ఆందోళనకు కారణమవుతున్నాయి. జూన్‌లో దాదాపు మూడు వారాల పాటు రుతుపవనాలు మందగించడంతో దేశంలో వర్షపాతం లోటు తీవ్రంగా పెరిగింది. అయితే జూలై ప్రారంభం నుంచి వరుసగా ఏర్పడిన అల్పపీడనాలు, బంగాళాఖాతం నుంచి వచ్చిన తేమ గాలుల కారణంగా రుతుపవనాలు ఒక్కసారిగా పుంజుకున్నాయి. దీంతో పశ్చిమ, మధ్య, ఉత్తర భారతంలోని పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. ఈ వర్షాలతో దేశ సీజనల్ వర్షపాతం లోటు గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం సాధారణం కంటే 14.3 శాతం తక్కువగా ఉన్నప్పటికీ.. రుతుపవనాల వర్షపాతం సాధారణ స్థాయికి చేరినట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) గణాంకాలు సూచిస్తున్నాయి. జలాశయాల్లో నీటి నిల్వలు పెరగడం, నేలలో తేమ మెరుగుపడటం, ఖరీఫ్ సాగు వేగం పుంజుకోవడం వంటి ప్రయోజనాలు కనిపించాయి. అయితే ఈ ఊపు ఎక్కువ కాలం కొనసాగకపోవచ్చని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.





**మళ్లీ వర్షాలకు బ్రేక్?**

జూలై 10 నుంచి 15 మధ్య ఉత్తర, పశ్చిమ, మధ్య భారతంతో పాటు పశ్చిమ తీర ప్రాంతాల్లో వర్షాల తీవ్రత తగ్గే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న అల్పపీడన వ్యవస్థ బలహీనపడటం, మేఘాల విస్తరణ తగ్గడం ఇందుకు కారణాలుగా చెబుతున్నారు. ఈ వర్ష విరామం కారణంగా జూలై మధ్య నాటికి దేశ మొత్తం వర్షపాతం మళ్లీ లోటు స్థాయికి చేరే అవకాశం ఉందని అంచనా. ముఖ్యంగా ఇటీవల వరి, ఇతర వర్షాధార ఖరీఫ్ పంటలు వేసిన ప్రాంతాల్లో నేలలో తేమ తగ్గితే మొలక దశలో ఉన్న పంటలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**తెలంగాణలో పెరగనున్న ఎండల తీవ్రత**

మరోవైపు వర్షాల విరామ ప్రభావంతో తెలంగాణలోనూ ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. జూలై 10 నుంచి 15 మధ్య రాష్ట్రవ్యాప్తంగా 35 డిగ్రీల నుంచి 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

**ఎల్‌నినో ప్రభావమేనా?**

సాధారణంగా ఎల్‌నినో పరిస్థితులు భారత రుతుపవనాలపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. ఈ సమయంలో ఒకేసారి భారీ వర్షాలు కురిసిన తర్వాత.. ఎక్కువ కాలం వర్ష విరామాలు ఏర్పడే ధోరణి కనిపిస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అంటే రుతుపవనాలు మొత్తం సీజన్‌లో సమానంగా విస్తరించకుండా.. భారీ వర్షాలు, పొడి కాలాల మధ్య ఊగిసలాడే పరిస్థితి ఏర్పడుతుంది. ఇటీవల వర్షాలతో దేశ నీటి పరిస్థితి కొంత మెరుగుపడినప్పటికీ.. రుతుపవనాల గమనం ఇంకా అనిశ్చితంగానే ఉందని నిపుణులు చెబుతున్నారు. జూలై చివరి వారంలో మరోసారి వర్షాలు పుంజుకునే అవకాశం ఉన్నప్పటికీ.. అప్పటి వరకు రైతులు ఆకాశం వైపే చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మొత్తంగా 9 రోజుల వర్షాలతో ఊపిరి పీల్చుకున్న భారత్‌కు.. ఇప్పుడు మరో వర్ష విరామం పరీక్షగా మారనుంది. ఎల్‌నినో ప్రభావం ఎంత మేరకు ఉంటుందన్నది రాబోయే వారాల్లో తేలనుంది.

# ఆ రోజు పోలీసులే నన్ను తప్పుదోవ పట్టించారు.. అది పక్కా కుట్ర: కరూర్ ఘటనపై సీఎం విజయ్

మొదటి పేజి తరువాయి

ఎన్నికల ప్రచార సభకు ముందు జరిగిన ఆ విషాదం వెనుక కుట్ర ఉందని, పోలీసులు తనను తప్పుదోవ పట్టించారని సంచలన ఆరోపణలు చేశారు. ఈ పర్యటనలో ఏర్పాటు చేసిన సభలో విజయ్ మాట్లాడుతూ.. "ఆ విషాదం నా జీవితంలో అత్యంత బాధాకరమైన క్షణం. అది నన్ను ఇప్పటికీ వెంటాడుతూనే ఉంది. ఎంత విజయం సాధించినా జీవితంలో ఇలాంటి ఘటనలు జరుగుతాయి. నేను కరూర్‌లోకి ప్రవేశిస్తున్నప్పుడు పోలీసులు నన్ను ఆపి ఉండొచ్చు కదా? ఆ సమావేశాన్ని రద్దు చేసే హక్కు వారికి ఉంది. కానీ, వారు అలా చేయలేదు, పైగా నన్ను లోపలికి నడిపించారు" అని పోలీసుల తీరును తప్పుపట్టారు. "ఈ ఘటనకు అసలు బాధ్యులు ఎవరు? దీని వెనుక ఎవరున్నారు?" అని ప్రశ్నిస్తూ, అప్పటి అధికార పార్టీ అయిన డీఎంకేపై విమర్శలు ఎక్కుపెట్టారు. తొక్కిసలాట తర్వాత తాను మౌనంగా ఉండటంపై వచ్చిన విమర్శలను కూడా ఆయన తిప్పికొట్టారు. "అమాయకమైన పసిపిల్లలు చనిపోయారు. నేను తీవ్ర వేదనతో ఇంట్లో కుమిలిపోతుంటే, దాక్కున్నానంటూ మీరు నన్ను ఎగతాళి చేశారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. తన రాజకీయ ప్రత్యర్థులు, పోలీసులు కలిసి ఈ తొక్కిసలాటను సృష్టించారని





ఆరోపించారు. "పోలీసులు తగినంత సిబ్బందిని మోహరించారా? సిగ్గులేకుండా నాపై నిందలు వేశారు. అసెంబ్లీలో ఎంకే స్టాలిన్ ఈ అంశంపై రాజకీయం చేశారు" అని మండిపడ్డారు. తన పార్టీ తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఎన్నికల ప్రచారాన్ని దెబ్బతీయడానికే ఈ కుట్ర పన్నారని విజయ్ ఆరోపించారు.

**కోర్టుల్లోనూ కొనసాగిన పోరు**

మరోవైపు కరూర్ తొక్కిసలాటలో మరణించిన 41 మంది కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలన్న విజయ్ సర్కార్ నిర్ణయంపై న్యాయపోరాటం జరిగింది. ఈ నిర్ణయం సీబీఐ విచారణలో సాక్షులను ప్రభావితం చేసేలా ఉందని ఆరోపిస్తూ డీఎంకే సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే, డీఎంకే పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. "ఒక ముఖ్యమంత్రి ఏం చేయాలో కోర్టు చెప్పాలని మీరు కోరుకుంటున్నారా? ఈ కేసులో సీఎం విజయ్ నిందితుడు కాదు" అని ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది. దీంతో డీఎంకే తన పిటిషన్‌ను ఉపసంహరించుకుని, సీబీఐ ఏర్పాటు చేసిన పర్యవేక్షక కమిటీని ఆశ్రయించింది. తాజాగా ఈరోజు ముఖ్యమంత్రి కరూర్ పర్యటనకు గంట ముందు, మద్రాస్ హైకోర్టులోని మదురై ధర్మాసనం ఈ విషయంలో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. బాధితుల కుటుంబాలకు నియామక పత్రాలు అందజేయడానికి అనుమతి ఇచ్చింది. అయితే, ఈ నియామకాలు తాత్కాలికమైనవని, కోర్టు తుది తీర్పునకు లోబడి ఉంటాయని స్పష్టం చేసింది. దీంతో సీఎం విజయ్‌కు న్యాయపరంగా ఊరట లభించినట్లయింది.

# సోషల్ మీడియా దుర్వినియోగంపై ఉక్కుపాదం... చంద్రబాబు కేబినెట్ కీలక నిర్ణయాలు !

మొదటి పేజి తరువాయి

విద్వేషాలు వ్యాప్తి చేసే హ్యాండిల్స్‌ను గుర్తించడానికి ఆధునిక ఫోరెన్సిక్ టూల్స్ కొనుగోలుకు నిధులు.

సోషల్ మీడియా కేసుల దర్యాప్తుపై ఎస్‌హెచ్‌ఓలకు ప్రత్యేక శిక్షణ, సైబర్ పరిజ్ఞానం ఉన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ల (పీపీల) నియామకం.

ఇతర దేశాల్లోని చట్టాలను అధ్యయనం చేసి, అవసరమైతే ప్రత్యేక చట్టం తీసుకురావడంపై పరిశీలన.

**భారీ పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్**

రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచే లక్ష్యంతో స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ (ఎస్ఐపీబీ) ఆమోదించిన ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం 13 ప్రాజెక్టులకు సంబంధించి రూ.31,431 కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటి ద్వారా రాష్ట్రంలో 31,431 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

తిరుపతి జిల్లా శ్రీసిటీలో మాండెలెజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.1801 కోట్లతో ఏర్పాటు చేయనున్న చాక్లెట్ తయారీ యూనిట్ వీటన్నింటిలో ముఖ్యమైనది. ఈ యూనిట్ ద్వారా దేశంలోనే కోకో వినియోగించి చాక్లెట్లు తయారు చేయడంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానానికి చేరుకుంటుందని మంత్రి వివరించారు. అలాగే వేస్ట్ ఆయిల్స్‌ను ఏవియేషన్ ఫ్యూయల్‌గా మార్చేందుకు ఎస్ఏఎఫ్ఎఫ్ ఇండియా ఏర్పాటు చేయనున్న పరిశ్రమకు కూడా ఆమోదం తెలిపారు.

**అమరావతిపై కీలక నిర్ణయాలు**

అమరావతికి సంబంధించి కేబినెట్ పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంది. రాజధానిలో భూములు ఇచ్చిన రైతులకు ఊరట కల్పిస్తూ వార్షిక కౌలును పెంచింది. జూన్ 12, 2024 తర్వాత ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద భూములు ఇచ్చిన రైతులకు ఈ పెంపు వర్తిస్తుంది. మెట్ట భూములకు ఎకరాకు రూ.30,000 నుంచి రూ.40,000కు, జరీబు భూములకు రూ.50,000 నుంచి రూ.60,000కు వార్షిక కౌలును పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. వీరికి 10 సంవత్సరాల పాటు ఈ కౌలు చెల్లిస్తారు.

అలాగే, గ్రామ కంఠాల్లో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు ఇచ్చే నెలవారీ పరిహారాన్ని రూ.5,000 నుంచి రూ.10,000కు పెంచుతూ 12 నెలల పాటు అందించాలని తీర్మానించారు. వీటితో పాటు,



అమరావతిలో నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు, ఈషా ఫౌండేషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్, సీఐఐ గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ వంటి సంస్థలకు భూ కేటాయింపులకు ఆమోదం తెలిపారు. ముఖ్యంగా, నేషనల్ ఫిషరీస్ బోర్డు ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో అక్వేరియం, ఆర్నమెంటల్ ఫిష్ బ్రీడింగ్ సెంటర్ ఏర్పాటు కానుంది.

**విద్యారంగానికి పెద్దపీట**

సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో ప్రభుత్వం కీలక అడుగు వేసింది. సాంఘిక సంక్షేమ గురుకులాల్లో చదివే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఐఐటీ-జేఈఈ, నీట్ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు అత్యుత్తమ శిక్షణ ఇచ్చేందుకు మూడు "సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్" ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటిని విశాఖపట్నం, నెల్లూరు, అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో ఏర్పాటు చేస్తారు. కార్పొరేట్ సంస్థలకు దీటుగా నాణ్యమైన శిక్షణ ఇచ్చి, పేద విద్యార్థులను ఐఐటీలు, ఐఐఎంలలో సీట్లు సాధించేలా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి పార్థసారథి తెలిపారు.

**టూరిజం ప్రోత్సాహానికి కొత్త పాలసీ**

ఆంధ్రప్రదేశ్‌ను ఒక ప్రధాన పర్యాటక కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం నూతన విధానాన్ని ప్రకటించింది. రాష్ట్రంలో సంగీత కచేరీలు (జశీఅఎవతీం), కార్నివాల్స్ వంటి భారీ ఈవెంట్లను నిర్వహించే వారికి 'వయబిలిటీ గ్యాప్ ఫండింగ్' కింద ఆర్థిక సహాయం అందించనుంది. 20,000 మంది లోపు హాజరైతే రూ.2 కోట్లు, 20,000 నుంచి 50,000 మధ్య హాజరైతే రూ.5 కోట్లు, 50,000 దాటితే రూ.5 కోట్ల వరకు ప్రభుత్వం ఆర్థిక చేయూతనిస్తుంది. దీనికి తోడు, ప్రభుత్వ ఆధీనంలోని పెద్ద మైదానాలను ఉచితంగా వాడుకునేందుకు కూడా అవకాశం కల్పిస్తుంది.

**సాగునీటి ప్రాజెక్టులు, జల సంరక్షణ**

సాగు, తాగునీటి ప్రాజెక్టులపై కేబినెట్ ప్రత్యేకంగా దృష్టి సారించింది. పెద్దగడ్డ రిజర్వాయర్ ప్రాజెక్టు పనులకు సంబంధించి ఐదుసార్లు టెండర్లు విఫలమైన నేపథ్యంలో, 14.88 శాతం ఎక్కువకు కోట్ చేసిన టెండర్‌ను ఆమోదించింది. కుప్పం బ్రాంచ్ కెనాల్ నుంచి చెరువులకు నీటిని అందించే పనులకు రూ.67.98 కోట్లకు పరిపాలన ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా 'జలధార' కార్యక్రమం పురోగతిని సమీక్షించాలని, ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తాగునీరు, పశుగ్రాసంపై ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు.

**భూ సమస్యల పరిష్కారానికి చర్యలు**

దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించింది. గుంటూరు జిల్లా పుల్లడిగుంట గ్రామంలో దశాబ్దాలుగా నివసిస్తున్న 200 కుటుంబాలకు ఊరట కల్పిస్తూ, వారు నివసిస్తున్న 10.16 ఎకరాల 'తోపు పోరంబోకు' భూమిని పట్టా భూమిగా మార్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో ఇలాంటి భూ వర్గీకరణ సమస్యలతో ఇబ్బంది పడుతున్న వేలాది కుటుంబాలకు న్యాయం చేస్తామని, మార్చి 2027 నాటికి పరిష్కరించగల అన్ని రెవెన్యూ సమస్యలను పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారని మంత్రి పేర్కొన్నారు.

**మరికొన్ని ముఖ్యమైన ఆమోదాలు**

అనంతపురం, మంగళగిరి, రాయదుర్గంలో టీడీపీ కార్యాలయాల నిర్మాణానికి భూమి కేటాయింపు.

విశాఖపట్నంలో ఎన్ఐఏ కేసుల విచారణ కోసం ప్రత్యేక కోర్టు ఏర్పాటు.

రైతుల నుంచి వరి ధాన్యం సేకరణ, ఖరీఫ్ విత్తనాల కోసం ఎన్‌సిడిసి నుంచి రూ.1800 కోట్ల రుణం సమీకరణ.

తిరుపతి సమీపంలో ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు భూ కేటాయింపు.

హైకోర్టులో ఒక రిజిస్ట్రార్ పోస్టు మంజూరు.

కాగా, ఈ కేబినెట్ సమావేశానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్ గైర్హాజరయ్యారు. పవన్ భుజం శస్త్రచికిత్స కోసం ముంబై వెళ్లనున్న నేపథ్యంలో ఆయన నేటి సమావేశానికి దూరంగా ఉన్నారు. ఇక, ఐటీ మంత్రి నారా లోకేశ్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ ప్రస్తుతం దక్షిణ కొరియా పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే.

## హరీశ్ రావు కాంగ్రెస్‌లోకి వస్తానంటే పీఏసీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం: మహేశ్ గౌడ్



హైదరాబాద్: హైదరాబాద్ గాంధీ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రతిపక్షాలపై విమర్శల జడివాన కురిపించారు. ముఖ్యంగా బీఆర్ఎస్ నాయకుడు హరీశ్ రావును లక్ష్యంగా చేసుకుని ఘాటు వ్యాఖ్యలు చేశారు. పదేళ్లు అధికారంలో ఉండి కుంగిపోయే ప్రాజెక్టులు కట్టిన మీరు... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి గడువులు విధించడం హాస్యాస్పదమని మహేశ్ గౌడ్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ మార్క్ అభివృద్ధి చూసి ఆయనకు మిట్టమధ్యాహ్నమే చుక్కలు కనిపిస్తున్నాయన్నారు. హరీశ్ రావు ఒకవేళ కాంగ్రెస్‌లోకి వస్తానంటే... తమ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీలో (పీఏసీ) చర్చించి నిర్ణయం తీసుకుంటామని వ్యాఖ్యానించారు. ఒక ప్రాంతీయ పార్టీ అయిన బీఆర్ఎస్ ఖాతాలో రూ.1,400 కోట్లు ఎలా జమ అయ్యాయో చెప్పాలని నిలదీశారు. నాడు బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా ఉండి నీళ్ల దోపిడీని ప్రశ్నించని ప్రస్తుత బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్... ఇప్పుడు అదే బీఆర్ఎస్ పార్టీకి వత్తాసు పలుకుతున్నట్టుగా కనిపిస్తోందని అన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న బీజేపీ హామీ ఏమైందని ప్రశ్నించారు. గత 12 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం ఎన్ని ఉద్యోగాలు కల్పించిందో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌లో క్రమశిక్షణ అందరికీ ఒకటేనని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. కడియం శ్రీహరి, కొండా సురేఖ వివాదాలపై సచిన్ సావంత్, జగ్గారెడ్డిలతో కూడిన కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయన్నారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ప్రతినిధులతో చర్చించి ఈ నెల 15న కొలిక్కి తెస్తామని కీలక అప్‌డేట్ ఇచ్చారు.

## పేదల ఆరోగ్యంతో ఆడుకుంటే ఊరుకోం చల్లూరు పీహెచ్‌సీ తనిఖీల్లో కౌశిక్ రెడ్డి హెచ్చరిక



హైదరాబాద్: ప్రభుత్వ వైద్యంపై ఆధారపడే పేద ప్రజల ఆరోగ్యం పట్ల అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హుజురాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హెచ్చరించారు. వీణవంక మండలం చల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కనీస వసతులు లేవని, సిబ్బంది కొరతతో వైద్యం అందడం లేదని స్థానికుల నుంచి ఫిర్యాదులు వచ్చాయని ఆయన తెలిపారు. స్థానిక నాయకులతో కలిసి ఈరోజు ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కౌశిక్ రెడ్డి... ఆసుపత్రిలోని ఓపీ రిజిస్టర్, మందుల కౌంటర్, ల్యాబ్‌లను స్వయంగా పరిశీలించి, అక్కడ అందుతున్న సేవలపై వైద్యాధికారి డాక్టర్ సంతోష్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఒకప్పుడు ప్రసవాల విభాగంలో విశేష ప్రతిభ కనబరిచి, ఏకంగా మూడు సార్లు ప్రతిష్ఠాత్మక అవార్డులు సాధించిన చల్లూరు పీహెచ్‌సీ... నేడు అధికారుల నిర్లక్ష్యం వల్ల అధ్వాన్నంగా తయారయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రికి మొత్తం 12 మంది సిబ్బంది మంజూరై ఉన్నప్పటికీ, అందులో సగం మంది డిప్యుటేషన్‌పై వేరే ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. ఇక్కడ కేవలం ఒక్క డాక్టర్, అరకొర సిబ్బందితో నెట్టుకురావడం వల్ల పేదలకు పూర్తిస్థాయి వైద్యం అందడం లేదన్నారు. ఆసుపత్రి నుంచే జిల్లా వైద్యాధికారి వెంకటరమణతో కౌశిక్ రెడ్డి ఫోన్ లో మాట్లాడారు. డిప్యుటేషన్‌పై వెళ్లిన సిబ్బందిని తక్షణమే వెనక్కి రప్పించి, చల్లూరు పీహెచ్‌సీలో పూర్తిస్థాయి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. వచ్చే వారం రోజుల్లో తాను మళ్లీ ఈ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శిస్తానని... ఆలోగా ఆసుపత్రి నిర్వహణ, సిబ్బంది హాజరు, పరిశుభ్రతతో పాటు రోగులకు అందించే వైద్య సేవల్లో స్పష్టమైన మార్పు రావాలని అధికారులకు గడువు విధించారు. విధుల్లో అలసత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ ముఖ్య నేతలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ తాడేపల్లి ప్రెసిడెంట్ అంబటి తిరుపతిరావు పలు సేవా కార్యక్రమాల్లోచురుగ్గా పాల్గొంటున్నారు.



జూలై 10 తాడేపల్లి నేటి శుభోదయ : జనసేన పార్టీ తాడేపల్లి ప్రెసిడెంట్ అంబటి తిరుపతిరావు పలు సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. మరియు స్థానిక సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కారం కోసం అధికారులతో మాట్లాడి ప్రజల మన్ననలు అనుకుంటున్నారు జనసేన పార్టీ బలోపేతం చేస్తూ మరియు స్థానిక ఎమ్మెల్యే మంత్రి లోకేష్ టీం తో కలిసి పనిచేస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నారు .ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన తాడేపల్లి మున్సిపల్ సూపర్వైజర్ హనుమంతరావు గారిని జనసేన పార్టీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు అంబటి తిరుపతిరావు గారు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, అవసరమైన సహాయ సహకారాల కోసం జనసేన పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.ఈ పరామర్శ కార్యక్రమంలో జనసేన పార్టీ వార్డు అధ్యక్షులు చంద్రశేఖర్, 19వ వార్డు అధ్యక్షులు దినేష్ చక్రవర్తి, ఎం.టి.ఎం.సి కార్యదర్శి మేకా నాని, జనసేన బాబాయిగా పేరొందిన చల్లా వెంకటేశ్వర్లు తదితర జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.రోడ్డు ప్రమాదంలో గాయపడిన హనుమంతరావు గారు త్వరగా కోలుకుని తిరిగి విధుల్లో చేరాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు.

## మంత్రి ఆనం కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కొల్లు అంకబాబు అమరావతి,





నేటి శుభోదయ ::: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రముఖ సీనియర్ జర్నలిస్టు కొల్లు అంకబాబు శుక్రవారం తాడేపల్లిలోని మంత్రి నివాసానికి విచ్చేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో తనకు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఆత్మీయ అనుబంధాన్ని, పరస్పర గౌరవం, ఆప్యాయతలను కొల్లు అంకబాబు గుర్తు చేసుకున్నారు. ప్రజా జీవితంలో విలువలకు కట్టుబడి, నిబద్ధతతో పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న నాయకుడిగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రత్యేక గుర్తింపు పొందారని ఆయన కొనియాడారు.ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, పరిపాలనలో పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ, దేవాదాయ శాఖ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామివారి, శ్రీ వేంకటేశ్వర స్వామివారి, పరమేశ్వరుని అనుగ్రహంతో మంత్రికి ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, యశస్సు, కీర్తి చేకూరాలని, మరింత ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ ప్రజలకు చిరకాలం సేవలందించాలని కొల్లు అంకబాబు మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

## నరేంద్రపురంలో ఘనంగా శ్రీ.శ్రీ.శ్రీ భద్రకాళి సమేత భావనాఋషి నూతన ఆలయ శంకుస్థాపన..



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె)రాజానగరం మండలం, నరేంద్రపురం గ్రామంలో శ్రీశ్రీశ్రీ భద్రకాళి సమేత భావనాఋషి నూతన ఆలయ నిర్మాణానికి అత్యంత వైభవంగా శంకుస్థాపన మహోత్సవం జరిగింది. భక్తిశ్రద్ధలతో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ శుభకార్యానికి రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ సతీమణి శ్రీమతి బత్తుల వెంకటలక్ష్మి హాజరయ్యారు. ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేసిన అనంతరం, శాసనసభ్యులు మాట్లాడుతూ.. దైవచింతనతో కూడిన ఆలయ నిర్మాణం గ్రామానికి ఎంతో మేలు చేకూరుస్తుందని, ఆధ్యాత్మిక అభివృద్ధికి ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. భావనాఋషి ఆలయ నిర్మాణం చేపట్టడం అభినందనీయమని, ఈ పుణ్యకార్యంలో భాగస్వాములు కావడం సంతోషకరమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ పెద్దలు, భక్తజన బృందం, ఆలయ కమిటీ సభ్యులు మరియు అధిక సంఖ్యలో గ్రామస్థులు పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

## ప్రశ్న రావణ్ పై.. జన సైనికులు ఫిర్యాదు..!!



( నేటి శుభోదయ జులై : 11 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) ఏపీ డిప్యూటీ సీఎం జనసేనపార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ పై అలాగే హిందు మనోభవలు దెబ్బతినేల సనాతన ధర్మం పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రశ్న రావణ్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ విశాఖ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన నాయకులందరూ కలిసి శుక్రవారం మల్కాపురం స్టేషన్ లో పిర్యాదు చేయడం జరిగింది. ప్రశ్న అనే యూట్యూబ్ ఛానల్ ద్వారా ఇష్టానుసారంగా మాట్లాడుతూ హిందువులు ఎంతగానో ఆరాధించే శ్రీరాముడు గురించి భారతదేశ ఔన్యత్వం గురించి, దేశ భద్రతాను ప్రాణాలు సైతం లెక్కచేయక కాపాడుతున్న సైనికుల గురించి మాట్లాడిన మాటలు దుర్మార్గమైనవి. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని ఉప మ్మఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని ఉద్దేశించి ఇష్టానుసారంగా సభలు పెట్టుకొని ఆ సభల్లో నచ్చిన విధంగా మాట్లాడుతూ రాజ్యాంగం నాకు మాట్లాడే స్వేచ్ఛ నిచ్చిందని చెబతూ ఇష్టానుసారంగా ఆడిన పదాలు ద్వారా దేశ సమగ్రతకి ,గౌరవానికి భంగం కలుగుతుందని ఇలాంటి వ్యక్తుల్ని ముందు పెట్టుకని వెనుక నుండి నడిపిస్తూన్న వైసీపీ నాయకులు రావణ్ అనే యూట్యూబర్ ఎలాంటివ్వడో మరిచిపోయి అతనితో రాజకీయం చేస్తున్నారు ప్రశ్న రావణ్ అనే వ్యక్తి కారణంగా ఎంతోమంది మహిళల ఇబ్బంది పడడమే కాకుండా మనమందరం చూస్తున్నాం ఇలాంటి వాడికి సాయం చేస్తున్న నటుడు ప్రకాష్ రాజ్ మీద కూడా తగిన చర్యలు తీసుకోవాలని మల్కాపురం పోలీస్ వారిని పిర్యాదు ద్వారా కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ ముఖ్య నాయకులు,ఏఎంసీ డైరెక్టర్లు ,టెంపుల్ కమిటీ డైరెక్టర్లు,వార్డు అధ్యక్షులు ,వీర మహిళలు పాల్గొన్నారు.

## 'ప్రాజెక్ట్ కాఫీ' ఆధ్వర్యంలో 1,000 వేప మొక్కల నాటడం

-- 10 మిలియన్ వృక్షాల లక్ష్యానికి మరో ముందడుగు..!!

- రాజమండ్రి పరిసర కోరుకొండ మండలం కోటి గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టిన 'పాజెక్టు కాఫి' ..!




కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);క్రియేటివ్ ఆక్సిజన్ ఫర్ ఫ్యూచర్ ఎన్విరాన్మెంట్ ఎద్యుకేషన్ (కాఫీ) ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, హరితాభివృద్ధి మరియు పర్యావరణ అవగాహనను పెంపొందించేందుకు కొరుకొండ మండలం కోటి గ్రామంలో 1,000 వేప మొక్కల నాటే కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ప్రాజెక్టు కాఫీ యొక్క ప్రధాన లక్ష్యం 10 మిలియన్ (1 కోటి) వృక్షాలను నాటి, వాటిని సంరక్షించడం ద్వారా పచ్చని, కాలుష్య రహిత స్థిరమైన భవిష్యత్తును నిర్మించడం ప్రధాన లక్ష్యం అని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం కేవలం మొక్కలు నాటడానికే పరిమితం కాకుండా, ప్రతి మొక్కను జీవించి ఎదిగే వృక్షంగా తీర్చిదిద్దే బాధ్యతను సమాజంతో కలిసి నిర్వహించడం దీని ప్రత్యేకతగా పేర్కొన్నారు.ఈ ప్రాజెక్ట్ ద్వారా పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలు, పట్టణాలు, పరిశ్రమలు మరియు స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో పర్యావరణ విద్య, జీవ వైవిధ్య పరిరక్షణ, వాతావరణ మార్పులపై అవగాహన, నీటి సంరక్షణ మరియు హరిత జీవన విధానాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రోత్సహించడం జరుగుతుంద వెల్లడించారు.ఈ కార్యక్రమంలో నాటిన వేప మొక్కల సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టబడ్డాయి. ప్రతి మొక్క ఆరోగ్యంగా ఎదిగేలా నీటి సరఫరా, పరిరక్షణ మరియు నిరంతర పర్యవేక్షణకు స్థానిక బృందం బాధ్యతలు స్వీకరించింది.ఈ హరిత కార్యక్రమానికి అడపా కనకరాజు సహకారం నిర్వహణ విశేషంగా నిలిచాయని అభినందించారు. వారి సమన్వయంతో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడిందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, యువత, విద్యార్థులు, స్వచ్ఛంద సేవకులు మరియు పర్యావరణ ప్రేమికులు ఉత్సాహంగా పాల్గొని హరిత భవిష్యత్తు కోసం తమ వంతు బాధ్యతను చాటిచెప్పారు.'మా లక్ష్యం: 10 మిలియన్ వృక్షాలు -- హరిత భవిష్యత్తు కోసం ఒక సామూహిక ఉద్యమం. ఈ రోజు నాటిన ప్రతి మొక్క... రేపటి తరాలకు జీవవాయువుగా' నినదించారు.

## జూలై 14లోపు ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించండి

-- ఓటు హక్కును కాపాడుకోండి

ప్రజాస్వామ్య రక్షణకు ఓటు హక్కే వజ్రాయుధం:

టీడీపీ సీనియర్ నాయకుడు యాగంటి మల్లికార్జున రావు



మాచర్ల, జూలై 10: నేటి శుభోదయ పల్నాడు జిల్లా మాచర్ల : "ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రజాస్వామ్యాన్ని కాపాడే వజ్రాయుధం. ఓటు కోల్పోతే ప్రజాస్వామ్యంలో మీ విలువను కోల్పోయినట్టే" అని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు యాగంటి మల్లికార్జున రావు అన్నారు.మాచర్ల పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలోని సచివాలయాన్ని సందర్శించిన ఆయన, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం పురోగతిని బీఎల్ఓలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ జూలై 14లోపు ప్రతి అర్హుడైన ఓటరు ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి సంబంధిత బీఎల్ఓలకు అందజేసి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యానికి ప్రజల ఓటే వెన్నెముక అని పేర్కొన్న ఆయన, 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువకుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని, పేరు లేకపోతే వెంటనే బీఎల్ఓను సంప్రదించి నమోదు చేయించుకోవాలని సూచించారు.గతంలో వేలాది మంది ఓట్లను అక్రమంగా తొలగించిన ఘటనలు జరిగాయని ఆరోపిస్తూ, అలాంటి పరిస్థితులు మళ్లీ తలెత్తకుండా ప్రతి కుటుంబం అప్రమత్తంగా ఉండాలని అన్నారు. "ప్రజాస్వామ్యం బతకాలంటే ప్రతి ఓటు లెక్కలో ఉండాలి. ఒక్కో ఓటు దేశ భవిష్యత్తును నిర్ణయించే శక్తి కలిగి ఉంటుంది" అని స్పష్టం చేశారు.జూలై 21న విడుదలయ్యే ముసాయిదా ఓటరు జాబితాలో మీ పేరు లేకపోతే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించిన యాగంటి, మిగిలింది కేవలం నాలుగు రోజులే కావడంతో ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాచర్ల పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బీఎల్ఓలు మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పెందుర్తి పోలీస్ స్టేషన్ గంజాయి వినియోగదారులపై ప్రత్యేక నిఘా..!!

- ఏడుగురు గంజాయి వినియోగదారుల అరెస్టు




(నేటి శుభోదయ జులై : 11 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ డ్రా . శంఖబ్రత బాగ్చి, మరియు అదనపు జిల్లా మెజిస్ట్రేట్ ఆదేశాలు, మేరకు పశ్చిమ ఉపవిభాగం అసిస్టెంట్ కమిషనర్ పి . ప్రదీప్తి పర్యవేక్షణలో, పెందుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.వి. సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి వినియోగదారులు మరియు మాదకద్రవ్యాలకు సంబంధించిన కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుంది ఈ క్రమంలో, ఇన్స్పెక్టర్ సూచనల మేరకు పెందుర్తి పోలీస్ సిబ్బంది 09.07.2026 తేదీన బ్యాంక్ కాలనీ, చెరువు సమీపంలో తనిఖీలు నిర్వహించగా, ఏడుగురు వ్యక్తులు గంజాయి సేవిస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద లభ్యమైన గంజాయిని స్వాధీనం చేసుకుని, రాపిడ్ గంజా టెస్ట్ నిర్వహించగా వారు గంజాయి సేవించినట్లు నిర్ధారణ కావడంతో, వారిపై ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు.విచారణలో, వారు స్థానికంగా గంజాయిని కొనుగోలు చేసి సేవిస్తున్నట్లు వెల్లడించారు. గంజాయి సరఫరా చేసిన వ్యక్తిని గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయి.ఈ సందర్భంగా పెందుర్తి సీఐ కె.వి. సతీష్ కుమార్ మాట్లాడుతూ, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, గంజాయి వినియోగం వ్యక్తిగత జీవితాన్ని, కుటుంబాలను మరియు సమాజాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని తెలిపారు. గంజాయి వినియోగం, కొనుగోలు, విక్రయం లేదా రవాణా వంటి చర్యలు చట్టరీత్యా శిక్షార్హమైన నేరాలని హెచ్చరించారు.

భవిష్యత్తులో గంజాయి సేవిస్తూ లేదా మాదకద్రవ్యాలకు సంబంధించిన ఏవైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలలో పాల్గొంటూ ఎవరైనా గుర్తిస్తే, వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అలాగే, గంజాయి విక్రయం, రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిసినట్లయితే వెంటనే పెందుర్తి పోలీస్ స్టేషన్కు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.మాదకద్రవ్యాల రహిత సమాజ ఐ.పి.ఎస్., కమిషనర్ ఆఫ్ పోలీస్ శాఖకు సహకరించాలని పెందుర్తి పోలీసులు కోరుతున్నారు.

## రైతు సోదరులు పంట బీమా తప్పనిసరిగా చేసుకోవాలి

మండల వ్యవసాయ శాఖ అధికారుల సూచన



యాడికి జులై 10 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : ప్రస్తుత ఖరీఫ్ (2026-27) సీజన్కు సంబంధించి రైతు సోదరులందరూ తమ పంటలకు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు ఒక ప్రకటనలో కోరారు. ఈ ఏడాది సూపర్ ఎల్ నినో ప్రభావం కారణంగా వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో, పంట బీమా ద్వారా రైతులకు ఆర్థిక రక్షణ మరియు ఉపశమనం లభిస్తుందని వారు పేర్కొన్నారు.ఈ సీజన్కు గానూ వివిధ పంటలకు ఎకరాకు చెల్లించాల్సిన ప్రీమియం వివరాలను అధికారులు వెల్లడించారు. వేరుశనగ పంటకు రూ.640, పత్తికి రూ.1,140, అరటి సాగుకు రూ.3,000 లుగా ప్రీమియం ధరలను నిర్ణయించారు. అలాగే కంది పంటకు రూ.80, జొన్నకు రూ.84, మొక్కజొన్నకు రూ.132, మరియు ఆముదం పంటకు ఎకరాకు రూ.80 చొప్పున రైతులు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.అర్హులైన రైతులు తమ పంట వివరాలను స్వీయ ధ్రువీకరణ పత్రం (సెల్ఫ్ డిక్లరేషన్) ద్వారా ధ్రువపరిచి, తమ ఆధార్ కార్డు మరియు పట్టాదారు పాసుపుస్తకంతో సహా సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్ ను సంప్రదించాలని కోరారు. అక్కడ నిర్ణీత ప్రీమియం చెల్లించి పంట బీమా కొరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.గడువు తేదీల వివరాలను వెల్లడిస్తూ... వేరుశనగ, పత్తి, అరటి పంటలకు ప్రీమియం చెల్లించడానికి ఈ నెల 15 (15.07.2026) చివరి తేదీ అని పేర్కొన్నారు. అలాగే కంది, జొన్న, మొక్కజొన్న, ఆముదం పంటల బీమాకు ఈ నెల 31 (31.07.2026) వరకు గడువు ఉందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గడువులోగా బీమా ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులు విజ్ఞప్తి చేశారు...

## విద్యతోనే అపార ఉపాధి అవకాశాలు..!!

- జర్నలిస్టుల పిల్లలకు ఉపకారవేతనాలు

జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల




( నేటి శుభోదయ విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) ప్రపంచవ్యాప్తంగా యువత అన్ని రంగాల్లో ఆశించిన స్థాయిలో రాణిస్తూ ముందుకు దూసుకుపోతున్నారని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి.. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు.. డాక్ యార్డ్ అసోసియేషన్ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు అన్నారు.. శుక్రవారం ఇక్కడ అక్కయ్యపాలెం కార్యాలయంలో జర్నలిస్టుల పిల్లలకు గంట్ల శ్రీనుబాబు ఉపకార వేతనాలు అందజేశారు.. తొలుత విద్యార్థులను సత్కరించి.. జ్ఞాపిక.. ప్రశంసా పత్రం నగదు బహుమతులు అందజేశారు.. ఈ సందర్భంగా గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ విద్యతోనే అపారమైన ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చు అన్నారు.. ప్రతి ఒక్కరూ తాము కోరుకున్న విధంగా ఉన్నత విద్యాభ్యాసం సాగించాలని పిలుపునిచ్చారు.. తల్లిదండ్రుల ఆశయాలు మేరకు ఉన్నతంగా రాణించాలని అలాగే మంచి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు.. ఈ ఏడాది ఇప్పటివరకు 160 మంది వరకు జర్నలిస్టుల పిల్లలకు ఉపకార వేతనాలు అందజేస్తూ వచ్చామన్నారు. మరో 12 మందికి దశలవారీగా అందజేయనున్నట్లు చెప్పారు.. కేవలం జర్నలిస్టుల పిల్లలను ప్రోత్సహించాలని అలాగే వారిని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దే సంకల్పం కలిగిన తల్లిదండ్రులకు వారి ద్వారా బాసటగా నిలవాలని భావించి ప్రతి ఏడాది ఈ కార్యక్రమం తాను సొంతంగా చేపడుతున్నట్లు చెప్పారు . ఏడాది పొడవునా. జర్నలిస్టుల సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నట్లు చెప్పారు తన పరిధి మేరకు మాత్రమే సహాయం చేస్తూ వస్తున్నానని చెప్పారు..

## "ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫస్ట్ ర్యాంకు సాధించిన విద్యార్థినికి ఆర్సిసిడిఎస్ తరపున ఘన సన్మానం"



పెంటపాడు జూలై 10 (అవినాష్ మారంపూడి నేటి- శుభోదయ)::: రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు కర్రీ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లమిల్లి విజయ్ ఆనంద్ రెడ్డి(అంజి) అధ్యక్షతన జిల్లా ప్రధాన కార్యదర్శి పరిరక్షణలో పెనుమంట్ర మండలం నత్తా రామేశ్వరం గ్రామంలో తాడి నాగఉమామహేశ్వరి ఇంటర్మీడియట్ సెకండియర్ అత్తిలి మండలంలోని ఫస్ట్ ర్యాంక్ సాధించిన విద్యార్థినికి ఆర్సిడిఎస్ తరపున శాలువాతో షీల్డ్ బహుకరించి సన్మానం చేయడం జరిగింది. ఈ విద్యార్థిని ఉన్నత చదువుల నిమిత్తం పలువురు దాతలు ముందుకు వచ్చారు.తాడి సూర్య చంద్రారెడ్డి 5000/-, వెలగల నాగవెంకటత్రినాథ్ రెడ్డి 5000/-, కర్రి సత్యనారాయణ రెడ్డి 5000/-,సత్తి రమేష్ రెడ్డి 5000/- కొవ్వూరి వెంకట్ రెడ్డి 5000/- కర్రి సూర్యనారాయణ రెడ్డి 5000/-, కర్రి యశ్వంత్ రెడ్డి 5000/- విద్యార్థినికి ఆర్థిక సహాయం అందజేశారు. మరొక విద్యార్థిని పైడిమర్ల ఈక్షిత రెడ్డి జుత్తిక గవర్నమెంట్ స్కూల్లో పదవ తరగతి ప్రథమ స్థానం సాధించడం జరిగింది. ఈ విద్యార్థిని కూడా ఆర్సిడిఎస్ ఆధ్వర్యంలో షీల్డ్,శాలువాతో సత్కరించి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు కర్రి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో 10,000/- రూపాయలు ఈక్షితా రెడ్డికి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కర్రీ హిమబిందు, పదాల శ్రీహరిరెడ్డి, కొవ్వూరి రామిరెడ్డి, లక్ష్మి, మల్లిడి కిరణ్ కుమార్ రెడ్డి, కర్రి లక్ష్మి కుమారి, కర్రి సాయి రెడ్డి, గుడిమెట్ల రామకృష్ణారెడ్డి, గుడిమెట్ల జ్యోతి,తాడి శ్యామల, గారు, తాడి త్రిమూర్తు రెడ్డి, పైడిమర్ల ఉష, మేడపాటి శ్రీనివాస్ రెడ్డి, కొవ్వూరు తాతారెడ్డి, ఇల్లందరపర్రు గ్రామ అధ్యక్షులు గుడిమెట్ల రామకృష్ణారెడ్డి, బేతిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జుత్తిగ సంధ్య జ్యోతి వృద్రాశ్రమంలో వృద్ధులు కూర్చోవడానికి మేడపాటి సుభాష్ చంద్ర రెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు ఒక సిమెంట్ బెంచ్, వృద్ధులకు ఒక సీలింగ్ ఫ్యాన్ కొవ్వూరు తాతారెడ్డి బహుకరించారు. దాతలను ఆర్సిడిఎస్ తరపున ఇరువురుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యమే ఆరుగురు మత్స్యకారుల ప్రాణాలను బలితీసుకుంది

**– బోటు ప్రమాదంపై స్పందించడంలో ప్రభుత్వ యంత్రాంగం ఘోర వైఫల్యం : వైయస్సార్‌సీపీ నేతల ధ్వజం**

( నేటి శుభోదయ జులై : 11 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) విశాఖ మద్దిలపాలెం నగర పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన వైయస్సార్‌సీపీ విశాఖ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మొల్లి అప్పారావు, గాజువాక నియోజకవర్గ ఇన్‌చార్జి తిప్పల దేవన్‌రెడ్డి, రాష్ట్ర మత్స్యకారుల విభాగం అధ్యక్షుడు విజయ్ చంద్ర కూడా మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1 కోటి పరిహారం చెల్లించడంతో పాటు మత్స్యకారుల భద్రతకు శాశ్వత చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ప్రమాద సమాచారం వచ్చిన వెంటనే స్పందించి ఉంటే ఆరుగురు మత్స్యకారులను కాపాడే అవకాశం ఉండేది. 24 గంటల పాటు రక్షణ వ్యవస్థలను పూర్తిస్థాయిలో అప్రమత్తం చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. వారం రోజులు గడిచినా బాధిత కుటుంబాలకు పూర్తి భరోసా కల్పించలేదు. రూ.10 లక్షల పరిహారం ప్రకటించి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. మత్స్యకారుల భద్రత, బీమా, రక్షణ చర్యలపై ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ప్రాణాలతో బయటపడిన చిన్నాకు కేవలం రూ.50 వేల సాయం చేయడం అన్యాయం. పూర్తిగా దెబ్బతిన్న బోటుకు తగిన పరిహారం ప్రకటించలేదు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మత్స్యశాఖ మంత్రి ఘటనాస్థలికి వెళ్లకపోవడం బాధాకరం. వైఎస్ జగన్ ఫోన్‌లో బాధితుడు చిన్నాకు ధైర్యం చెప్పి త్వరలో పరామర్శిస్తానని హామీ ఇచ్చారు. గతంలో జగన్ ప్రభుత్వం బోట్లు దగ్ధమైన ఘటనల్లో 24 గంటల్లోనే భారీ పరిహారం అందించింది. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1 కోటి పరిహారం ఇవ్వాలి మత్స్యకారులకు పూర్తి న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది : ప్రెస్‌మీట్‌లో స్పష్టం చేసిన వైయస్సార్‌సీపీ నేతలు విశాఖపట్నం సముద్రంలో జరిగిన బోటు ప్రమాదంలో ఆరుగురు మత్స్యకారులు ప్రాణాలు కోల్పోవడానికి రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని వైయస్సార్‌సీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే రక్షణ చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం, సంబంధిత వ్యవస్థలు ఘోరంగా విఫలమయ్యాయని విమర్శించారు. వారం రోజులు గడిచినా బాధిత కుటుంబాలకు పూర్తి భరోసా కల్పించకుండా, తూతూమంత్రంగా పరిహారం ప్రకటించి చేతులు దులుపుకోవడం అమానుషమని మండిపడ్డారు. విశాఖపట్నంలోని మద్దిలపాలెం నగర పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన వైయస్ఆర్‌సీపీ విశాఖ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మొల్లి అప్పారావు, గాజువాక నియోజకవర్గ ఇన్‌చార్జి తిప్పల దేవన్‌రెడ్డి, విజయ్ చంద్ర మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1 కోటి పరిహారం చెల్లించడంతో పాటు మత్స్యకారుల భద్రతకు శాశ్వత చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.




ప్రెస్‌మీట్‌లో వైయస్సార్‌సీపీ నేతలు ఏమన్నారంటే..

– ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రాణనష్టానికి కారణం: మొల్లి అప్పారావు

ప్రమాద సమాచారం అందిన వెంటనే ప్రభుత్వం స్పందించి, సముద్రంలో రక్షణ చర్యలు ప్రారంభించి ఉంటే ఆరుగురు మత్స్యకారుల ప్రాణాలు కాపాడే అవకాశం ఉండేది. కానీ 24 గంటల పాటు సంబంధిత వ్యవస్థలను అప్రమత్తం చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ విషాదం చోటుచేసుకుంది. ప్రమాదం జరిగి వారం రోజులు గడిచినా బాధిత కుటుంబాలకు పూర్తి భరోసా కల్పించలేదు. మత్స్యకారుల భద్రత, బీమా, జీవనోపాధి విషయంలో ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి కనిపించడం లేదు. కేవలం రూ.10 లక్షల పరిహారం ప్రకటించి బాధ్యత నుంచి తప్పించుకోవాలని చూడటం సరైన విధానం కాదు. గతంలో వైయస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బోట్లు దగ్ధమైన ఘటనల్లో 24 గంటల్లోనే భారీ పరిహారం అందించి మత్స్యకారులకు అండగా నిలిచారు. ఇప్పటికైనా ప్రభుత్వం అదే మానవత్వంతో స్పందించి బాధిత కుటుంబాలకు పూర్తి న్యాయం చేయాలి. ప్రాణాలతో బయటపడిన చిన్నాతో వైయస్ జగన్ ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. త్వరలో స్వయంగా బాధిత కుటుంబాలను పరామర్శిస్తానని హామీ ఇచ్చారు. మత్స్యకారులకు పూర్తి న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌సీపీ అండగా నిలుస్తుంది.

– మత్స్యకారులను పరామర్శించే తీరిక సీఎం, డిప్యూటీ సీఎంకు లేదా: విజయ్ చంద్ర, వైయస్సార్‌సీపీ రాష్ట్ర మత్స్యకారుల విభాగం అధ్యక్షుడు

సముద్రంలో ఆరుగురు మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయిన ఇంతటి విషాద ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి అచ్చెన్నాయుడు ఇప్పటి వరకు బాధిత కుటుంబాలను పరామర్శించకపోవడం అత్యంత బాధాకరం. చిన్న చిన్న కార్యక్రమాలకు సమయం కేటాయించే ప్రభుత్వ పెద్దలకు, ప్రాణాలు కోల్పోయిన మత్స్యకారుల కుటుంబాలను పరామర్శించేందుకు మాత్రం సమయం లేకపోవడం విచారకరం. గతంలో వైయస్ జగన్ మోహన్ రెడ్డి మత్స్యకారుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. ఫిషింగ్ హార్బర్లు, జెట్టీలు నిర్మించి వారి జీవనోపాధిని బలోపేతం చేశారు. ప్రమాదాలు జరిగిన ప్రతిసారీ వెంటనే స్పందించి బాధిత కుటుంబాలకు అండగా నిలిచారు. కానీ ప్రస్తుతం మత్స్యకారుల ప్రాణాలకు ప్రభుత్వం కనీస విలువ కూడా ఇవ్వడం లేదు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే గౌరవప్రదమైన పరిహారం అందించాలి. మత్స్యకారుల భద్రత కోసం శాశ్వత రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి. మత్స్యకారులకు పూర్తి న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌సీపీ వారి పక్షాన నిలబడి పోరాడుతుంది.

– ఒక్కో కుటుంబానికి రూ.1 కోటి పరిహారం ఇవ్వాలి: తిప్పల దేవన్‌రెడ్డి

సముద్ర ప్రమాదంలో కుటుంబాలకు ఆధారమైన యువ మత్స్యకారులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరం. కేవలం రూ.10 లక్షల పరిహారం ప్రకటించడం ద్వారా ప్రభుత్వం బాధిత కుటుంబాలకు న్యాయం చేసినట్టుగా భావించడం సరైంది కాదు. ఆ కుటుంబాల భవిష్యత్తు, చిన్నపిల్లల చదువులు, జీవనోపాధి ఎలా సాగాలన్న అంశాన్ని ప్రభుత్వం ఆలోచించాలి. ప్రమాద సమాచారం అందిన తర్వాత కూడా రక్షణ చర్యల్లో ప్రభుత్వం తీవ్ర వైఫల్యం చెందింది. సమయానికి స్పందించి ఉంటే ప్రాణనష్టం తగ్గించే అవకాశం ఉండేది. ప్రాణాలతో బయటపడిన చిన్నాకు కేవలం రూ.50 వేల సాయం ప్రకటించడం మరింత బాధాకరం. ప్రమాదంలో పూర్తిగా దెబ్బతిన్న బోటుకు తగిన పరిహారం కూడా ప్రకటించకపోవడం అన్యాయం.గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వం ఇలాంటి ఘటనల్లో వెంటనే స్పందించి బాధిత కుటుంబాలకు, బోటు యజమానులకు భారీ పరిహారం అందించింది. ఇప్పుడు కూడా అదే మానవత్వంతో ప్రభుత్వం వ్యవహరించాలి. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1 కోటి పరిహారం, బోటు నష్టానికి పూర్తి పరిహారం వెంటనే ప్రకటించాలి. మత్స్యకారుల ప్రాణాలకు రక్షణ కల్పించే శాశ్వత భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేయాలని, బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు వైయస్సార్‌సీపీ అండగా ఉంటుందని నేతలు స్పష్టం చేశారు.

## మత్తు పదార్థాలు తీసుకుంటే జీవితం చిత్తవుతుందని, మత్తు ఒక మహా విపత్తు అని..!!

**జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇపిఎస్ భాగ్యలక్ష్మి అన్నారు.**



( నేటి శుభోదయ జులై : 11విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో ఈగల్ క్లబ్ మరియు జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన “మత్తు పదార్థాల నిర్మూలనలో యువత పాత్ర” అనే అంశంపై జరిగిన సదస్సులో ఆమె ముఖ్య వక్తగా మాట్లాడుతూ– మత్తు పదార్థాలు సేవించడం వల్ల యువత భవిష్యత్తు నాశనం అవుతోందని, చదువు– ఉద్యోగం దూరం అవుతున్నాయని, ఆరోగ్యం పూర్తిగా పాడవుతోందని ఆమె అన్నారు. మత్తు పదార్థాల కొనుగోలుకు ఒక్కొక్కసారి వారు దొంగతనాలకు కూడా పాల్పడుతున్నారని, మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారని అన్నారు. మత్తులో ఏం చేస్తున్నారో తెలియక అత్యాచారాలకు, నేరాలకు కూడా పాల్పడుతున్నారని అన్నారు.మత్తు పదార్థాల సేవనం వల్ల మానవ వనరులు నిర్వీర్యం అవుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయ దేవి మాట్లాడుతూ– మత్తు పదార్థాల నుండి యువతను కాపాడడానికి కౌన్సిలింగ్ సెంటర్లు, డి–ఎడిక్షన్ సెంటర్లు ఎక్కడికక్కడ సిద్ధంగా ఉన్నాయని, వీటిని యువత వినియోగించుకుని, ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అనుసరించాలని అన్నారు. కార్యక్రమంలో మత్తు పదార్థాలు సేవించడానికి గల కారణాలు, వాటిని నివారించే మార్గాలు తదితర అంశాలపై విద్యార్థినులు లోతుగా చర్చలు జరిపారు. సదస్సులో పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్స్ అందజేశారు.సదస్సు నిర్వాహకులను, సదస్సులో పాల్గొన్న వారిని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి అభినందించారు.

## సర్ ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ కి 3 రోజులే గడువు..!!

**– ఈఆర్ఓ వియంఆర్డీఏ ఈఓ దయానిధి**



( నేటి శుభోదయ జులై :11 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) గాజువాక తహసీల్దార్ కార్యాలయంలో సర్ పై సమీక్ష సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా గాజువాక అసెంబ్లీ నియోజకవర్గం ఈఆర్ఓ మరియు వియంఆర్డీఏ ఈఓ దయానిధి పాల్గొన్నారు. మొత్తం 309 పోలింగ్ బూత్లో 99.3 శాతం ఎన్యూమరేషన్ ఫారాలను బిఎల్ఓ లు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేసినట్లు తెలిపారు. అందులో నింపి తిరిగి ఇచ్చినవి డిజిటలైజేషన్ చేసినవి 72 శాతం అని తెలిపారు. మరో మూడు రోజుల్లో ప్రతి బూత్ నుండి మిగిలిన ఫారాలను తిరిగి తీసుకోవడానికి రాజకీయ పార్టీల బిఎల్ఏ టూ ప్రతినిధులు సహకరించాలని కోరారు. చనిపోయిన వారి ఓట్లను,శాశ్వతంగా చిరునామా మారిన వారివి,రెండేసి ఓట్లు ఉన్నవారివి పంచనామా నిర్వహించి తొలగించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు,టిడిపి నాయకులు పల్లా శ్రీనివాసరావు (బెంగుళూరు రమణ),జనసేన నాయకులు రౌతు గోవింద్ వైసీపీ నాయకులు వెంకటేష్ సిపియం నుండి రాంబాబు,బంగారు నాయుడు , గాజువాక తహశీల్దారు త్రినాథ్, పెద గంట్యాడ తహసీల్దార్ అమల,జివిఎంసి కమీషనర్ శేషాద్రి,డిప్యూటీ తహసీల్దార్ సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనగర్ సర్ గ్రామ సభలో పాల్గొన్న బిజేపి కన్వీనర్ కే,ఎన్,ఆర్..!!



( నేటి శుభోదయ జులై : 11 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) గాజువాక అసెంబ్లీ నియోజకవర్గం–25 లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ ఐ ఆర్ 2026 లో భాగంగా గాజువాక శ్రీనగర్ టిఎస్సార్ టిబికె స్కూల్ దగ్గర పోలింగ్ బూత్ లో ఏ ఈ ఆర్ ఓ గాజువాక డిప్యూటీ తహసీల్దార్ రవికాంత్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. బి ఎల్ ఓ లు ఆర్ పి లు పాల్గొని పోలింగ్ బూత్ ల వారీగా చనిపోయిన వారివి , శాశ్వతంగా అడ్రస్ మారిన వారివి, రెండేసి ఓట్లు వున్న వారి వివరాలతో కూడిన జాబితాను సిద్ధం చేసారు. 92,113,114,115,131 బూత్ ల పంచనామా నిర్వహించి అన్ని రాజకీయ పార్టీల బి ఎల్ ఏ టూ ల సంతకాలు సేకరించారు. గాజువాక బిజేపి కన్వీనర్ మరియు రాష్ట్ర మీడియా పేనలిస్ట్ కరణంరెడ్డి నరసింగరావు (కేఎన్ఆర్ ) పర్యటనలో భాగంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్యూమరేషన్ ఫారాలను నింపి తిరిగి ఇవ్వాడానికి మరో నాలుగు రోజుల సమయం మాత్రమే ఉందన్నారు. ఈ లోగా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా బిఎల్ఓ లకు అందజేయాలని సూచించారు. తమ పార్టీ తరపున నియోజకవర్గంలో 309 బూత్ లలో సర్ లో చురుకుగా పాల్గొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో బిజేపి బి ఎల్ ఏ టూ లు బగ్గు ఈశ్వరరావు ,కే వి రమణ ,బొత్స జగదీష్ శ్రీనివాసరావు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భోగాపురం ‘డేటా’ వెనుక దందా ఉందా ల్యాండ్ మాఫియా గుట్టు రట్టు చేస్తూ నిలదీసిన తెలుగు శక్తి

**– శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స కు తెలుగు శక్తి జన్మదిన శుభాకాంక్షలు – డేటా సెంటర్ల పేరిట రాబోయే పర్యావరణ వినాశనం – కోట్ల రూపాయల విలువైన భూములను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం – 200 ఎకరాల ల్యాండ్ స్కామ్ విలువ అక్షరాలా కొన్ని వేల కోట్ల రూపాయల – ఈ ప్రభుత్వానికి ప్రజలే త్వరలోనే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు**

**---- తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్**



( నేటి శుభోదయ జులై : 11 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) ఉత్తరాంధ్ర నడిబొడ్డున మరో భూకంపం సంభవించింది. అభివృద్ధి పేరిట సాగుతున్న కార్పొరేట్ దోపిడీని, పేద రైతుల పొట్టగొట్టే పాలకుల వంచనను ఎండగడుతూ తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్ విజయనగరం వేదికగా సంచలన గర్జన చేశారు. శాసనమండలి ప్రతిపక్ష నేత, వైఎస్సార్సీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ జన్మదిన వేడుకలకు హాజరైన ఆయన, రాష్ట్ర రాజకీయాలపై సుదీర్ఘ చర్చలు జరిపిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై పదునైన పవర్ పంచ్‌లతో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో పాలన పడకేసిందని, అభివృద్ధి శూన్యమని మండిపడ్డ ఆయన, ఈ ప్రభుత్వం బడాబాబుల అడుగులకు మడుగులు ఒత్తుతూ పేదల నోటికాడి కూడు లాక్కుంటోందని నిప్పులు చెరిగారు. భోగాపురం పరిసర ప్రాంతాల్లో ‘డేటా సెంటర్’ అనే రంగుల ప్రపంచాన్ని చూపిస్తూ, తెరవెనుక రిలయన్స్ సంస్థకు 350 ఎకరాల అత్యంత విలువైన భూములను కారుచౌకగా కట్టబెట్టడానికి వికృతమైన పావులు కదుపుతున్నారని రామ్ ధ్వజమెత్తారు. సవరవిల్లి నేషనల్ హైవే పక్కన, ఇప్పటికే ఉన్న రిలయన్స్ పెట్రోల్ బంకును ఆనుకుని ఉన్న కోట్ల రూపాయల విలువైన భూములను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేయడం దుర్మార్గమైన ల్యాండ్ మాఫియా కాదా అని ఆయన నిలదీశారు. దాదాపు 40 ఎళ్ల క్రితం నిరుపేద రైతులు కష్టపడి సాగు చేసుకుంటున్న అసైన్మెంట్ (డి–పట్టా) భూములను ప్రభుత్వం బలవంతంగా గుంజుకోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. “రెక్కాడితే గాని డొక్కాడని ఆ పేద రైతుల కుటుంబాల భవిష్యత్తును రోడ్డున పడేసి, కార్పొరేట్ శక్తులకు ఎర్రవాసి కార్పెట్ పరుస్తారా?” అంటూ పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించారు. ఇదే క్రమంలో పోలిపల్లి రెవెన్యూ పరిధిలో జరిగిన ఒక భారీ భూ అక్రమాన్ని ఆయన ఆధారాలతో సహా బట్టబయలు చేస్తూ, దీని వెనుక ఉన్న అసలు సూత్రధారులను ఎండగట్టారు. పోలిపల్లి రెవున్యూ సర్వే నంబర్ 336/1 లో ఒక పేద రైతు కుటుంబానికి దక్కిన 4.87 ఎకరాల డి–పట్టా భూమిని ఒక అధికార పార్టీ (టీడీపీ) నాయకుడు నడిరోడ్డుపై ఆక్రమించుకోవడమే కాకుండా, దానికి ఆనుకుని ఉన్న మరో 200 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా తన ఖాతాలోకి మార్చుకున్నాడని దుయ్యబట్టారు. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ పుణ్యమా అని ఈ ప్రాంతంలో ప్రస్తుతం ఉన్న భూముల రేట్ల ప్రకారం చూసుకుంటే.. ఈ 200 ఎకరాల ల్యాండ్ స్కామ్ విలువ అక్షరాలా కొన్ని వేల కోట్ల రూపాయల మహా కుంభకోణం అని బి.వి.రామ్ బల్లగుద్ది మరీ చెప్పారు! ఈ దందా ఏదో యాదృచ్ఛికంగా జరిగింది కాదని, సదరు టీడీపీ నాయకుడికి మరియు రిలయన్స్ సంస్థకు మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందం ప్రకారమే ఈ వందల ఎకరాల భూములు ఇప్పుడు డేటా సెంటర్ పేరుతో బదలాయింపు జరుగుతున్నాయని బి.వి.రామ్ సంచలన ఆరోపణ చేశారు. కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం అధికార పార్టీ నేతలు బ్రోకర్లుగా మారి పేదల భూములను తగలేస్తున్నారని మండిపడ్డారు. ఈ నగ్న సత్యం వెనుక ఏ అధికార యంత్రాంగం అవినీతి హస్తం ఉందో, ఏ పెద్దల సహకారం ఉందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బాధితులైన అసైన్మెంట్ రైతులు 2012 నుండి ఎంఆర్ఓ ఆఫీసుల చుట్టూ, కలెక్టరేట్ చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా పైసా న్యాయం చేయని పాలకులు, ఇప్పుడు అదే భూమిని రిలయన్స్ సంస్థకు ఏ హక్కుతో అప్పగిస్తున్నారని నిలదీశారు. అప్పట్లో రక్తం కళ్లచూసి సంపాదించుకున్న డి–పట్టా భూములను ఇలా కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తుంటే.. అసలు ఈ ప్రభుత్వం నిజంగా పేద డి–పట్టా దారులకు ఏ రోజైనా న్యాయం చేస్తుందా? లేక పెద్దలకే ఊడిగం చేస్తుందా? అని నిప్పులు చెరిగారు. దీనిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపితే ప్రభుత్వ పెద్దల గుట్టు రట్టవుతుందని హెచ్చరించారు. కేవలం భూదందా మాత్రమే కాదు, ఈ డేటా సెంటర్ల పేరిట రాబోయే పర్యావరణ వినాశనంపై బి.వి.రామ్ సాంకేతిక పరమైన ప్రశ్నలతో నిలదీశారు. ఐటీ డేటా సెంటర్ల సర్వర్లను 24 గంటలూ చల్లబరచడానికి రోజుకు లక్షలాది లీటర్ల నీరు అవసరమని, అసలే తాగునీటి ఎద్దడితో కొట్టుమిట్టాడుతున్న ఉత్తరాంధ్రలో ఈ ప్రాజెక్టుకు నీళ్లు ఎక్కడి నుండి తెచ్చి ఇస్తారో సమాధానం చెప్పాలన్నారు. ఈ డేటా సెంటర్ల వల్ల స్థానిక యువతకు ఉద్యోగాలు వస్తాయో రావో కానీ, ఇక్కడి నీటి వనరులను కార్పొరేట్ సంస్థల దాహానికి మళ్లించడం వల్ల ఉత్తరాంధ్ర గొంతు ఎండటం మాత్రం ఖాయమని హెచ్చరించారు. పేదల పొట్టకొట్టి, కార్పొరేట్ శక్తులకు దాసోహమంటున్న ఈ ప్రభుత్వానికి ప్రజలే త్వరలోనే గుణపాఠం చెబుతారని బి.వి.రామ్ హెచ్చరించారు.

## “పదవ తరగతిలో 100% ఫలితాలు సాధించాలని జాయింట్ డైరెక్టర్ ఉపాధ్యాయులకు సూచన”




పెంటపాడు జులై 10 (అవినాష్ మారంపూడి నేటి– శుభోదయ)::: రాష్ట్ర విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ కె.నాగేశ్వరరావు శుక్రవారం పెంటపాడులోని స్థానిక పోస్ట్ బేసిక్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని లైబ్రరీ, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, కిచెన్ గార్డెన్ తదితర ప్రయోగశాలలను పరిశీలించారు.

విద్యార్థులకు అందిస్తున్న వివిధసౌకర్యాలపై ప్రధానోపాధ్యాయురాలు డి. పద్మజ, నోడల్ ఆఫీసర్ టి.వి. రామకృష్ణ ను అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు, నోట్స్ వంటి విద్యా సామాగ్రి కిట్లు అన్ని విద్యార్థులకు సక్రమంగా అందుతున్నాయా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో పురోగతిని పరిశీలించి తగిన సూచనలు చేశారు.జాయింట్ డైరెక్టర్ కె. నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తుందన్నారు.

విద్యాశాఖ తరపున అకాడమిక్ తోపాటు సంక్షేమ కార్యక్రమాలను కూడా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.పి.ఎం.శ్రీ పథకానికి ఎంపికైన పాఠశాలల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు అందిస్తున్నామని, విద్యార్థులు తమ లక్ష్యాలకు అనుగుణంగా చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు ఎన్సీసీ, స్కౌట్ కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల మానసికంగా దృఢంగా తయారవుతారని, రానున్న విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షల్లో 100% ఫలితాలు సాధించేందుకు ఇప్పటినుండే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు.మధ్యాహ్న భోజనం నిర్వహిస్తున్న ప్రదేశాల్లో పరిశుభ్రత పాటించాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

స్కౌట్, ఎన్సీసీ విద్యార్థులు ప్రదర్శించిన విన్యాసాలను పరిశీలించి అభినందించారు.పాఠశాలను విజయవంతంగా నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు పద్మజను, ఉపాధ్యాయుల సమిష్టి కృషిని అభినందించారు. తల్లిదండ్రుల మన్ననలు పొందేలా అందరూ కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా ఏఎంఓ సి.హెచ్.చంద్రశేఖర్, పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ కళింగ లక్ష్మణరావు , ఎంఈఓలు ఎం. శ్రీనివాస్,టి.వి. రామకృష్ణ, సహోపాధ్యాయులు పోసియ్య,బి.సీతాదేవి, స్వరూప, బి.ప్రసాద్, శ్రీనివాస్ కుమార్, లలిత, విగ్నేష్, కిరణ్మయి, శైలజ, మల్లిక, సాయి, అప్పారావు, శ్రీనివాస్, శాంతకుమారి, సిఆర్పీలు చార్లెస్, చిట్టెమ్మ, ఎస్.టి.వి.ఎన్, ఉపాధ్యాయులు నారాయణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ జనాభా పై ప్రణాళిక తప్పనిసరి.

**కలెక్టర్ ఆనంద్....**



అనంత పురం జూలై 10 నేటి శుభోదయ:ప్రతి కుటుంబంలో సభ్యుల సంఖ్య పై ప్రణాళికాబద్ధమైన ఆలోచన చేయాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. శనివారం జరగనున్న ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలెక్టర్ ఛాంబర్ లో ఫ్లెక్సీ, గోడ పత్రికలను జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఈ బి దేవి తో పాటు విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 12వ తేదీ నుండి 18 వ తేదీ వరకు గ్రామస్థాయిలో ,మండల స్థాయిలో ,జిల్లా స్థాయిలో ,జనాభా నియంత్రణ, కాన్పుల మధ్య ఎడమ, తల్లి బిడ్డల ఆరోగ్యం, బాలిక వివాహాల అనర్థాల పై అవగాహన శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖతోపాటు మున్సిపాలిటీ, మహిళా శిశు సంక్షేమ శాఖ, సెర్ఫ్, మెప్మా, పంచాయతీ రాజ్ శాఖలు, విద్యాశాఖ, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేసి అవగాహన కల్పిస్తాయన్నారు. శనివారం రోజు అనంతపురం నగరంలో జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా ఆరోగ్య శాఖ కార్యాలయం నుండి ర్యాలీ నిర్వహించ ఉన్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఈ బీ దేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి నాగరాజు, గణాంక అధికారి మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బచ్‌పన్ ప్లే స్కూల్‌లో 'రెడ్ కలర్ డే' వేడుకలు



అనంత పురం జూలై 10 నేటి శుభోదయ:అనంతపురం నగరంలోని రాంనగర్‌లో బచ్‌పన్ ప్లే స్కూల్లో 'రెడ్ కలర్ డే' వేడుకలను శుక్రవారం ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఉపాధ్యాయులు అందరూ ఆకర్షణీయమైన ఎరుపు రంగు దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. ఎరుపు రంగు పండ్లు, వస్తువులు, బెలూన్లు ప్రదర్శిస్తూ చిన్నారులు ఆనందంగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ సరిత మాట్లాడుతూ, ఎరుపు రంగు ప్రేమ, ధైర్యం, శక్తి, ఉత్సాహానికి ప్రతీక అని తెలిపారు. చిన్నారులకు ఎరుపు రంగుకు సంబంధించిన పండ్లు, వస్తువులు వాటి ప్రాముఖ్యతను సులభంగా అర్థమయ్యే విధంగా వివరించారు.అలాగే పాఠశాల చైర్మన్ షాలీ దాదా గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని, పిల్లలకు ఎరుపు రంగు యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఇలాంటి కార్యక్రమాలు చిన్నారుల్లో రంగులపై అవగాహన పెంపొందించడంతో పాటు, వారి సృజనాత్మకత ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## పీవీకేకే ఐటి డిప్లొమా కళాశాలలో ఓరియంటేషన్ 2026కు విశేష స్పందన




అనంత పురం జూలై 10 నేటి శుభోదయ:స్థానిక రుద్రంపేటలోని పీవీకేకే ఐటి డిప్లొమా కళాశాలలో నూతనంగా ప్రవేశం పొందిన డిప్లొమా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కోసం నిర్వహించిన ఓరియంటేషన్--2026 కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. సుమారు 800 మంది విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని కళాశాల విద్యా విధానం, కోర్సుల ప్రత్యేకతలు, ఉపాధి అవకాశాలు, శిక్షణా విధానంపై సమగ్ర అవగాహన పొందారు.ఈ సందర్భంగా బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డా. పల్లె వెంకట కృష్ణ కిషోర్ మాట్లాడుతూ, నేటి సాంకేతిక ప్రపంచంలో డిప్లొమా విద్యార్థులకు అపారమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సాంకేతిక నైపుణ్యాలతో పాటు క్రమశిక్షణ, కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకుంటే ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలతో పాటు ప్రముఖ పరిశ్రమలు, సాఫ్ట్‌వేర్ సంస్థల్లోనూ ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని పేర్కొన్నారు. పీవీకేకే ఐటి డిప్లొమా కళాశాల జిల్లాలో నాణ్యమైన సాంకేతిక విద్యను అందిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తోందని అన్నారు.పీవీకేకే ఐటి డిప్లొమా కళాశాల ప్రిన్సిపాల్ డా. జి.ఎన్.ఎస్. వైభవ్ మాట్లాడుతూ, డిప్లొమా కోర్సుల ప్రత్యేకత, ఉన్నత విద్యకు అందుబాటులో ఉన్న అవకాశాలు, క్యాంపస్ ప్లేస్‌మెంట్లు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అందిస్తున్న శిక్షణ, అత్యాధునిక ల్యాబ్ సౌకర్యాల గురించి విద్యార్థులు, తల్లిదండ్రులకు వివరించారు. ఈ విద్యా సంవత్సరంలో 420 సీట్లకు 420 సీట్లు పూర్తిగా భర్తీ కావడం కళాశాలపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఉంచిన విశ్వాసానికి నిదర్శనమని తెలిపారు.ఈకార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు అడిగిన ప్రశ్నలకు అధ్యాపకులు సమగ్రంగా సమాధానాలు అందించి వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధి కె. శ్రీకాంత్ రెడ్డి, పీవీకేకే ఐటి కళాశాల ప్రిన్సిపాల్ డా. బండి రమేష్ బాబు, డిప్లొమా విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



## వెంగమ నాయుడు కాలనీలో తీవ్ర వోల్టేజ్ సమస్య

**విద్యుత్ పరికరాలు కాలిపోతున్నాయంటూ అధికారులకు జనసేన వినతి**




యాడికి జులై 10 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండల కేంద్రంలోని వెంగమ నాయుడు కాలనీలో గత కొన్ని నెలలుగా తీవ్ర విద్యుత్ ఒడిదుడుకులు (వోల్టేజ్ సమస్యలు) తలెత్తుతున్నాయని, దీనివల్ల కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జనసేన పార్టీ నాయకులు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఒక్కోసారి విద్యుత్ సరఫరాలో తీవ్ర హెచ్చుతగ్గులు (హై వోల్టేజ్) రావడం వల్ల ఇళ్లలోని టీవీలు, ఫ్రిజ్‌లు, కూలర్లు, ఫ్యాన్లు, వాషింగ్ మిషన్లు, లైట్లు వంటి విలువైన ఎలక్ట్రానిక్ ఉపకరణాలు కాలిపోయి భారీగా నష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న బంతి కేబుల్ వ్యవస్థను తొలగించి, దాని స్థానంలో నూతనంగా సిల్వర్ వైర్లను ఏర్పాటు చేయడం ద్వారానే ఈ వోల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వారు అభిప్రాయపడ్డారు. కాలనీవాసుల ఆర్థిక నష్టాన్ని, ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి, ఈ సమస్యను అతి త్వరగా పరిష్కరించాలని జనసేన యాడికి మండల కన్వీనర్ కోడి సునీల్ కుమార్, స్థానిక నాయకులు వై. రామకృష్ణ, కె. యద్ధు, పి. నాగభూషణం తదితరులు అధికారులకు సమర్పించిన వినతి పత్రంలో డిమాండ్ చేశారు.

## "ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై దృష్టి పెట్టండి సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్రాజెక్ట్ జిల్లా కోఆర్డినేటర్ ప్రసంగి రాజు"



తాడేపల్లిగూడెం జూలై 10 (అవినాష్ మారంపూడి నేటి-శుభోదయ)::: తాడేపల్లిగూడెం రూరల్ మండలంలోని నందమూరు, మారంపల్లి,కృష్ణాయపాలెం గ్రామ పంచాయతీలలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్రాజెక్ట్ జిల్లా కోఆర్డినేటర్ జి.ప్రసంగి రాజు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామాలలో పేరుకుపోయిన చెత్త కుప్పలను ప్లాస్టిక్ వ్యర్థాలను సక్రమంగా తొలగించాలన్నారు.సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నిర్వహణ చట్టాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని తెలిపారు.ంషఎ షెడ్డులో తడి చెత్త నుంచి వర్మీ కంపోస్ట్ తయారుచేసి పొడి చెత్తలను స్వచ్ఛరథాలు కి అందజేయాలని సూచించారు. ప్రతీ ఇంటి నుండి తడి, పొడి చెత్త లను బిన్ బ్యాగ్ పద్ధతిలో సేకరించాలన్నారు. గ్రామపంచాయతీలలో డోర్ టు డోర్ గార్బేజ్ సేకరణ జరగకపోవడం,బిన్ అండ్ బ్యాగ్ విధానంలో తడి చెత్త,పొడి చెత్త వేరు వేరుగా సేకరణ చేయకపోవడం, సేకరించిన తడి చెత్తతో వర్మీ కంపోస్ట్ తయారీ జరగకపోవడం గుర్తించినట్లు ఆయన తెలిపారు.దీనిపై సంబందిత పంచాయతీ అభివృద్ధి అధికారులను ఈ సందర్భంగా నిలదీశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మండల అభివృద్ధి అధికారి ముప్పిడి వెంకటేష్ పంచాయతీ అభివృద్ధి అధికారులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.

## పెనమలూరులో అభివృద్ధిపై చర్చకు ఎప్పుడైనా సిద్ధం

**-వైసీపీ అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మరు. కూటమి నాయకులు**



పెనమలూరు, జులై 10 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) రాష్ట్రంలోనే పెనమలూరు నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అహర్నిశలు శ్రమిస్తున్నారని పెనమలూరు నియోజకవర్గ నాయకులు స్పష్టం చేశారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతుండటంతో ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి వైసీపీ నాయకులు నిరాధార ఆరోపణలు,అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.పెనమలూరు నియోజకవర్గం తాడిగాడప మున్సిపాలిటీ పరిధిలోని పోరంకి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కూటమి నాయకులు మాట్లాడుతూ గత రెండేళ్లలో ఎమ్మెల్యే బోడే ప్రసాద్ కృషితో నియోజకవర్గానికి రూ.250 కోట్లకు పైగా అభివృద్ధి నిధులు తీసుకువచ్చారని తెలిపారు,ఇప్పటికే సుమారు రూ.200 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తయ్యాయని లేదా ప్రారంభించబడ్డాయని,మరో రూ.50 కోట్ల విలువైన పనులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు,ఈ అభివృద్ధి ప్రజల కళ్లముందు కనిపిస్తున్న వాస్తవమని అన్నారు.దళితవాడల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం రూ.6 కోట్ల నిధులు మంజూరు చేయడం కూటమి ప్రభుత్వానికి దళిత సంక్షేమంపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు,ప్రతి వర్గం అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.అభివృద్ధిపై ఎలాంటి సందేహాలున్నా ఆధారాలతో బహిరంగ చర్చకు రావాలని వైసీపీ నాయకులకు సవాల్ విసిరారు,వాస్తవాలను ప్రజల ముందుంచేందుకు తాము ఎప్పుడూ సిద్ధంగా ఉన్నామని, అసత్య ప్రచారాలతో రాజకీయాలు చేయడం మానుకుని నియోజకవర్గ అభివృద్ధికి సూచనలు ఇస్తే ప్రజాస్వామ్యానికి మేలు జరుగుతుందని హితవు పలికారు.2014 నుంచే ప్రజల మధ్య ఉంటూ ప్రతి సమస్యను తన సమస్యగా భావించి పరిష్కారానికి కృషి చేస్తున్న నాయకుడు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ని కొనియాడారు, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండటం, భారీగా అభివృద్ధి నిధులు సాధించడం, సంక్షేమం-అభివృద్ధిని సమన్వయం చేస్తూ ముందుకు సాగడం ఆయన నాయకత్వానికి నిదర్శనమని అన్నారు.రాజకీయాల్లో విమర్శలు సహజమే అయినప్పటికీ అవి వ్యక్తిగత దూషణలుగా కాకుండా అభివృద్ధిపై జరగాలని సూచించారు, పెనమలూరు అభివృద్ధే తమ ధ్యేయమని, ప్రజల సంక్షేమం కోసం రాజకీయాలకు అతీతంగా అందరి సహకారాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు.ప్రజలే అంతిమ న్యాయనిర్ణేతలని,అభివృద్ధిని చూసి నిజానిజాలను ప్రజలే నిర్ణయిస్తారని పేర్కొన్నారు,నిరంతరం ప్రజల కోసం శ్రమిస్తున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ని 2029 ఎన్నికల్లో మరింత భారీ మెజార్టీతో ప్రజలు ఆశీర్వదిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర గౌడ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామ ప్రసాద్ గౌడ్,రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పీత గోపీచంద్, రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ తాతపూడి గణేష్, ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు కోయ ఆనంద ప్రసాద్,బిసి సెల్ అధ్యక్షులు సంగేపు రంగారావు, బొగ్గవరపు శ్రీనివాసరావు, షేక్ హిమామ్ కూటమి నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల ఆలయం



విజయవాడ, జూలై 10 (నేటి శుభోదయ):- శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల ఆలయం శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం సహాయ కమిషనర్ రంగారావు క్యూలైన్ల నిర్వహణను పర్యవేక్షించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, సాధారణ భక్తులకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉదయం 10-30 గంటల నుండి మధ్యాహ్నం 2-30 గంటల వరకు అంతరాయ దర్శనం నిలిపివేశారు.అలాగే వీఐపీ దర్శనాలు కూడా నిలిపివేశారు. భక్తులందరికీ సజావుగా, ప్రశాంత వాతావరణంలో దర్శనం పూర్తయింది.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన దరఖాస్తుల పరిష్కారంపై సమీక్ష సమావేశం నిర్వహించిన వియంసి కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, జూలై 10 (నేటి శుభోదయ):- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అందిన దరఖాస్తుల పరిష్కారంపై విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం సాయంత్రం శాఖాధిపతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజల నుంచి అందిన ప్రతి దరఖాస్తును కమిషనర్ ఒక్కొక్కటిగా పరిశీలిస్తూ, సంబంధిత శాఖాధిపతులు ఇప్పటివరకు చేపట్టిన చర్యలు, సమస్యల ప్రస్తుత స్థితి, పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎక్కువ కాలంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వేగవంతంగా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. పరిష్కారమైన దరఖాస్తుల వివరాలను సక్రమంగా నమోదు చేయడంతో పాటు, దరఖాస్తుదారులకు తీసుకున్న చర్యలను తెలియజేసి వారి సంతృప్తిని నిర్ధారించాలన్నారు.ప్రస్తుతం భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)-2026 కార్యక్రమంలో భాగంగా అనేక మంది అధికారులు అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లుగా (ఏఈఆర్వోలు) ఎన్నికల విధులు నిర్వహిస్తున్నప్పటికీ, అదే సమయంలో ప్రజలకు అందించాల్సిన పౌర సేవలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ స్పష్టం చేశారు.

## ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే పాటించాలి



విజయవాడ, జూలై 10 (నేటి శుభోదయ):- నగరంలో పెరుగుతున్న దోమల సమస్యను నియంత్రించేందుకు ప్రతి ఇంట్లో ఫ్రైడేను, డ్రై డే గా పాటించాలని విజయవాడ నగరపాలక సంస్థ బయాలజిస్ట్ సూర్యకుమార్ నాయక్ అన్నారు. శుక్రవారం ఉదయం అయోధ్య నగర్ పరిసర ప్రాంతాలలో లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించి ఆ ప్రాంతంలో గల ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా బయాలజిస్ట్ సూర్యకుమార్ నాయక్ మాట్లాడుతూ నగరంలో దోమల సమస్యలను నియంత్రించేందుకు విజయవాడ నగరపాలక సంస్థ విస్తృతమైన చర్యలు తీసుకుంటుందని అందులో భాగంగా నగరంలో ఉన్న కాలువల్లో పూడికలు తొలగించి నీటి ప్రవాహం ఎక్కడ ఆగకుండా చూసుకుంటున్నారని, ట్రాక్టర్ మెషిన్ తో బోట్ల సహాయంతో సిబ్బంది కాలువల్లో పర్యటించి గుర్రపుడెక్కలను, వ్యర్థాలను తొలగిస్తున్నారని, సిబ్బంది వెళ్లలేని చోట డ్రోన్ ని పంపించి ఎంఎల్ ఆయిల్స్ స్ప్రే చేసి దోమల లార్వా ఉత్పన్నమవుకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.మరోవైపు నగర పరిధిలో ఫాగింగ్, స్ప్రేయింగ్, మరి కొన్నిచోట్ల దోమల లార్వాని తినే గంబోజియా చాపలను విడుదల చేస్తూ నగరంలో దోమల నియంత్రణకు విస్తృతమైన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఒకవైపు విజయవాడ నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంటున్నప్పటికీ ప్రతి ఇంట్లో దోమలు ఉత్పన్నం అవ్వకుండా డ్రైడే పాటిస్తే ప్రతి ఇంట్లో దోమల సమస్యలు ఉండవని అన్నారు. తమ ఇంట్లో, ఇంటి చుట్టు పరిసరాలలో ఎక్కడ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ముఖ్యంగా తొట్లు, వాడుక లేని బకెట్లు, మగ్గులు, డ్రమ్ములు, పూల కుండీలు, అలా ఏ వస్తువు అయినా వాడుకంలో లేనివి అందులో నీటి నిల్వ ఉండే అవకాశం ఉన్నవి, ప్రతి శుక్రవారం వాటిని గమనించి ఆ నిల్వ ఉన్న నీరుని పారవేస్తే ఇంట్లో దోమల సమస్య తగ్గుతుందని అన్నారు. అజిత్ సింగ్ నగర్ ప్రాంతంలో ఉన్న ప్రజలకు వారి ఇంటి వద్దకు వెళ్లి నీటి నిల్వలు ఎక్కువగా ఉండే అవకాశం ఎక్కడ ఉన్నాయని చూపించి, వాటిని పారేస్తే అందులో లార్వా చచ్చిపోతుందని వారికి అవగాహన కల్పించి ప్రతి శుక్రవారం దీన్ని పాటిస్తే దోమలను శాశ్వతంగా నియంత్రించవచ్చని వారికి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో బయాలజిస్ట్ తో పాటు హెల్త్ అసిస్టెంట్ పి.బి. శ్రీనివాసరావు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, మలేరియా సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## 24 మంది లబ్ధిదారులకు 10.06 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే బొండా ఉమా



విజయవాడ, జూలై 10 (నేటి శుభోదయ):- బిఆర్ టిఎస్ రోడ్డు లోని ఎమ్మెల్యే కార్యాలయంలో 25, 27 డివిజన్లకు చెందిన అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన 24 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.10,06,070 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి (జవీ=ఖీ) చెక్కులను ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేని నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందన్నారు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన వారికి వేగంగా ఆర్థిక సాయం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు, ఈ సహాయనిధి ద్వారా అనేక కుటుంబాలకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో సైతం మెరుగైన వైద్యం అందుతోందని ఎమ్మెల్యే తెలిపారు. సెంట్రల్ నియోజకవర్గ ప్రజల సమస్యలను తన కుటుంబ సమస్యలుగా భావించి ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటూ, అవసరమైన ప్రతి సందర్భంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరవేస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , మంత్రి నారా లోకేష్ సహకారంతో నియోజకవర్గానికి అత్యధికంగా ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరయ్యేలా కృషి చేస్తున్నామని చెప్పారు.గత ప్రభుత్వంలో ప్రజలు వైద్య సహాయం కోసం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వచ్చిందని, ప్రస్తుతం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్య భద్రతకు పెద్దపీట వేస్తూ పారదర్శకంగా ముఖ్యమంత్రి సహాయనిధి అందిస్తోందని అన్నారు.ఈ కార్యక్రమంలో సెంట్రల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ 27వ డివిజన్ ఇంచార్జ్ నవనీతం సాంబశివరావు, మాజీ కార్పొరేటర్ వీరమాచినేని లలిత, 25వ డివిజన్ అధ్యక్షులు మాచర్ల గోపి, మాచర్ల పావని, 27వ డివిజన్ అధ్యక్షులు దాసరి జయరాజు, మల్లంపల్లి సురేష్, మద్దాల రుక్మిణి, కొండపల్లి రూప్ కుమార్, కార్యకర్తలు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## నేడు జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**రాజీ ద్వారా కేసుల పరిష్కారంతోసమయం,డబ్బు ఆదా- మానవ సంబంధాల బలోపేతం- ఇంచార్జ్ జిల్లా ప్రధానన్యాయమూర్తి,మొదటి అదనపు జిల్లా జడ్జి కె. సునీత**



మచిలీపట్నం, జూలై 10( అజయ్ నారగాని - నేటి శుభోదయ)జాతీయ న్యాయసేవా అధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ జి. గోపి ఆదేశానుసారం కృష్ణా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జూలై 11న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఇంచార్జ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, మొదటి అదనపు జిల్లా జడ్జి కె. సునీత, తెలిపారు.శుక్రవారం సాయంత్రం మచిలీపట్నంలోని జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవా సదన్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆమె, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. వరలక్ష్మితో కలిసి జాతీయ లోక్ అదాలత్ నిర్వహణకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.ఇంచార్జ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె. సునీత మాట్లాడుతూ, ఈ ఏడాదిలో నిర్వహిస్తున్న రెండో జాతీయ లోక్ అదాలత్ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలతో పాటు ఏలూరు జిల్లాలోని నూజివీడు, కైకలూరు కోర్టుల పరిధిలో నిర్వహించబడుతుందని తెలిపారు. రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద పరిహార క్లెయిమ్ కేసులు, ట్రాఫిక్ చలానా కేసులు, అన్ని రకాల సివిల్ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరస్పర అంగీకారంతో పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. మచిలీపట్నం, విజయవాడ, గుడివాడ, నూజివీడు, నందిగామ, అవనిగడ్డ, కైకలూరు, గన్నవరం, తిరువూరు, చల్లపల్లి, పమిడిముక్కల, మైలవరం, ఉయ్యూరు, మొవ్వ కోర్టుల ఆవరణలో మొత్తం 45 బెంచీలు ఏర్పాటు చేసినట్లు, వాటిలో మచిలీపట్నంలోనే ఐదు బెంచీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత మార్చి 14న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1,09,388 కేసులు పరిష్కారమయ్యాయని, ఈసారి అంతకంటే ఎక్కువ కేసులను పరిష్కరించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు రాజీ చేసుకోవడం వల్ల సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని, పరస్పర అవగాహన పెరిగి మానవ సంబంధాలు బలోపేతం అవుతాయని, అర్హత ఉన్న కేసుల్లో కోర్టు ఫీజు కూడా తిరిగి చెల్లించబడుతుందని పేర్కొన్నారు.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. వరలక్ష్మి మాట్లాడుతూ లోక్ అదాలత్ అనేది కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదని, ప్రజలకు వేగవంతమైన న్యాయం అందించే సమర్థవంతమైన ప్రత్యామ్నాయ వివాద పరిష్కార వేదిక అని అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు పోలీసులు, న్యాయవాదులు, బీమా సంస్థలు, బ్యాంకులు, ఆర్థిక సంస్థలు తదితర శాఖల ప్రతినిధులతో పలుమార్లు సమన్వయ సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, కుటుంబ వివాదాలు, ఇతర సివిల్ స్వభావం గల కేసులతో పాటు కోర్టులో దాఖలు కాకముందే రాజీ ద్వారా పరిష్కరించుకునే ప్రీ-లిటిగేషన్ కేసులను కూడా ఈ జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించే అవకాశం కల్పించినట్లు వివరించారు. రాజీ పడదగ్గ కేసులకు సంబంధించిన కక్షిదారులందరూ ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో 'సమాధాన్ సమరోహ్'స్త్ర ప్రత్యేక లోక్ అదాలత్

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. వరలక్ష్మి మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో 'సమాధాన్ సమరోహ్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకునేందుకు పక్షిదారులకు ఈ కార్యక్రమం ద్వారా అరుదైన అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 21, 22, 23 తేదీల్లో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.అంతకుముందు జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో ప్రీ-లోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహించి, సంబంధిత పక్షిదారులను పిలిపించి రాజీ అవకాశాలను పరిశీలించనున్నట్లు తెలిపారు. సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగ్గ కేసులకు సంబంధించిన పక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పరస్పర అంగీకారంతో తమ వివాదాలను పరిష్కరించుకోవాలని ఎస్. వరలక్ష్మి విజ్ఞప్తి చేశారు.

## యాడికిలో ఘనంగా 'ప్రత్యేక విద్యుత్ అదాలత్'

**వినియోగదారుల సమస్యల పరిష్కారమే ధ్యేయం**




యాడికి, జూలై 10 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండల కేంద్రంలోని కమలపాడు రోడ్డులో గల విద్యుత్ కార్యాలయ ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ, గుత్తి ఆపరేషన్ డివిజన్ ఆధ్వర్యంలో 'ప్రత్యేక విద్యుత్ అదాలత్' (విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్, రిటైర్డ్ జడ్జి వి. శ్రీనివాస ఆంజనేయ మూర్తి ముఖ్య అతిథిగా విచ్చేసి నేతృత్వం వహించారు. వారితో పాటు సాంకేతిక సభ్యుడు జె. ఆనంద్ కుమార్, స్వతంత్ర సభ్యుడు ఎ. శ్రీనివాస బాబు, ఆర్థిక సభ్యురాలు డబ్ల్యూ. విజయలక్ష్మి ఈ అదాలత్‌లో పాల్గొని వినియోగదారుల నుండి అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న బిల్లింగ్ సమస్యలు, లో-వోల్టేజ్, కొత్త కనెక్షన్ల జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి, ఇతర సాంకేతిక సమస్యలను త్వరితగతిన, చట్టబద్ధంగా పరిష్కరించడమే ఈ ప్రత్యేక అదాలత్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

వినియోగదారులు తమ సమస్యలను లిఖితపూర్వకంగా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వచ్చిన ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. గుత్తి ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. పద్మనాభ పిళ్ళై పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది, యాడికి మండల పరిధిలోని పెద్ద సంఖ్యలో విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు..

# రైళ్లు నిలపడానికి చోటెక్కడ



అమరావతి, విజయవాడ, నేటి శుభోదయ ::: విజయవాడ మీదుగా కొత్త రైళ్లు కావాలని ఏటా ప్రజా ప్రతినిధులు విజ్ఞప్తి చేస్తూ ఉంటారు. కానీ ఉన్న రైళ్ళను నిలపడానికి కావాల్సిన స్థలం మాత్రం అందుబాటులో లేదు.సాధారణంగా ఒక రైల్వే లైన్ నిర్మాణం చేపట్టేపుడు ట్రాక్ కు రెండు వైపుల 5 నుంచి 7 మీటర్ల స్థలాన్ని ముందే సేకరిస్తారు. భవిష్యత్తులో కొత్త లైన్ల నిర్మాణం, ట్రాక్ మరమ్మతులు ఇతర అవసరాల కోసం భూమిని ముందే అందుబాటులో ఉంచుతారు.నిజాం రైళ్లు, ఈస్ట్ ఇండియా కంపెనీ రైళు రాకపోకలు సాగించినప్పటి నుంచి ఇదే సూత్రం అమలు చేస్తున్నారు. కొత్త లైన్ల నిర్మాణం కోసం ముందే భూ సేకరణ చేస్తారు.విజయవాడలో మాత్రం గత 50 ఏళ్లలో రైల్వే భూములు దశల వారీగా ఆక్రమణకు గురవుతూ వచ్చాయి. స్థానిక ప్రజా ప్రతినిధులు రైల్వే భూముల్ని ఎడాపెడా అమ్మేశారు. వాటిలో కాలనీలకు కాలనీలు పుట్టుకు వచ్చాయి. గ్రాండ్ ట్రంక్ మార్గంలో కేఎల్ రావ్ నగర్ నుంచి పాత రాజరాజేశ్వరి పేట వరకు వందలాది ఎకరాల రైల్వే భూమి అన్యాక్రాంతం అయ్యింది. పాల ఫ్యాక్టరీ సమీపంలో ఉన్న కొండ ప్రాంతం రైల్వే భూభాగం అయినా ఇప్పటికీ ఆక్రమణలు కొనసాగుతున్నాయి.మరో వైపు ఉన్న రైళ్ళను నిలిపి ఉంచడానికి, మరమ్మతులు, మెయింటైనెన్స్ కోసం వాషింగ్ లైన్ ల కొరత ఉంది. కొత్త రైళ్లు ప్రకటించినా వాటిని నిలిపేందుకు అవసరమైన స్థలం అందుబాటులో లేదు. కొత్త జోన్ ఏర్పాటు తర్వాత రైల్వే అవసరాల కోసం భూమిని గుర్తిస్తున్నారు. జిటి లైన్లో మూడో ట్రాక్ నిర్మాణం కోసం అవసరమైన భూమి అందుబాటులో లేదు. దీంతో రైల్వే అధికారులు తమ భూములు గుర్తించే పనిలో పడ్డారు.పాత రాజరాజేశ్వరి పేటలో సుబ్బరాజు నగర్, అల్లు జయలక్ష్మి నగర్ తో పాటు దాదాపు 150 ఎకరాల రైల్వే భూమి ఆక్రమణలో ఉంది. రైల్వే భూమిలో విఎంసి విద్యుత్ లైన్లు, మంచి నీటి పైప్ లైన్లు, సిసి రోడ్లు నిర్మించింది. ఫ్లాట్ల లెక్కలో ప్రజా ప్రతినిధులు స్థలాలు అమ్మేశారు. మరో వైపు రైల్వే అధికారులు ఆక్రమణకు గురైన భూమి రైల్వే తక్షణ అవసరాల కోసం వినియోగించాలని భావిస్తున్నారు. దీంతో ఆక్రమణదారులు నోటీసులు ఇస్తున్నారు. తమ స్థలాలు క్రమబద్ధీకరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## జూలై 14లోపు ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించండి

**-- ఓటు హక్కును కాపాడుకోండిప్రజాస్వామ్య రక్షణకు ఓటు హక్కే వజ్రాయుధం:**

**టీడీపీ సీనియర్ నాయకుడు యాగంటి మల్లికార్జున రావు**

**మాచర్ల, జూలై 10: నేటి శుభోదయ పల్నాడు జిల్లా మాచర్ల**



"ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రజాస్వామ్యాన్ని కాపాడే వజ్రాయుధం. ఓటు కోల్పోతే ప్రజాస్వామ్యంలో మీ విలువను కోల్పోయినట్టే" అని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు యాగంటి మల్లికార్జున రావు అన్నారు.మాచర్ల పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలోని సచివాలయాన్ని సందర్శించిన ఆయన, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం పురోగతిని బీఎల్ఓలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ జూలై 14లోపు ప్రతి అర్హుడైన ఓటరు ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి సంబంధిత బీఎల్ఓలకు అందజేసి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు.ప్రజాస్వామ్యానికి ప్రజల ఓటే వెన్నెముక అని పేర్కొన్న ఆయన, 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువకుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని, పేరు లేకపోతే వెంటనే బీఎల్ఓను సంప్రదించి నమోదు చేయించుకోవాలని సూచించారు.గతంలో వేలాది మంది ఓట్లను అక్రమంగా తొలగించిన ఘటనలు జరిగాయని ఆరోపిస్తూ, అలాంటి పరిస్థితులు మళ్లీ తలెత్తకుండా ప్రతి కుటుంబం అప్రమత్తంగా ఉండాలని అన్నారు. "ప్రజాస్వామ్యం బతకాలంటే ప్రతి ఓటు లెక్కలో ఉండాలి. ఒక్కో ఓటు దేశ భవిష్యత్తును నిర్ణయించే శక్తి కలిగి ఉంటుంది" అని స్పష్టం చేశారు.జూలై 21న విడుదలయ్యే ముసాయిదా ఓటరు జాబితాలో మీ పేరు లేకపోతే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించిన యాగంటి, మిగిలింది కేవలం నాలుగు రోజులే కావడంతో ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాచర్ల పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బీఎల్ఓలు మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## చేనేత,హస్త కళాకారులను ప్రోత్సహిద్దాం...


**మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లా పల్లవి .**



అనంతపురం బ్యూరో జూలై 10 నేటి శుభోదయ:సమాజంలోని ప్రతి ఒక్కరూ చేనేత, హస్త కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అనంతపురం మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లా పల్లవి తెలిపారు. శుక్రవారం సాయంత్రం అనంతపురం 3వ రోడ్డు జి. ఆర్. గార్డెన్ ఈస్ట్ గేట్ నెం 4లో ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ లిమిటెడ్ (లేపాక్షి) విజయవాడ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కళా మహోత్సవం– 2026 ప్రదర్శనను మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లా పల్లవి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన రాష్ట్ర విశిష్టసంస్కృతిసాంప్రదాయాలను ప్రతిబింబించే ఎన్నో అద్భుతమైన చేతి వృత్తుల కళాఖండాలు హస్తకళల ప్రదర్శన మరో వైపు విక్రయాలు ఈ మహోత్సవంలో ప్రత్యేక ఆకర్షణీయంగానిలుస్తాయన్నారు. రాష్ట్రానికి చెందిన హస్త కళాకారులు రూపొందించే కళారూపాలను ప్రదర్శించి అమ్మకాలు నిర్వహించుకునేలా గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, చేనేత మంత్రి సవితమ్మ ప్రత్యేక చర్యలు తీసుకొని కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం చేనేతలకు 200 యూనిట్లు పవర్లూమ్ కుటుంబాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు.అలాగే మన ఉమ్మడి జిల్లాలోని ధర్మవరం ప్రాంతం ప్రపంచవ్యాప్తంగా చేనేత వస్త్రాలకు ప్రసిద్ధిగాంచిందని, తోలుబొమ్మలాట నిమ్మలకుంట తోలు బొమ్మలాట కళాకారులు కూడా ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చారని అన్నారు. సాంప్రదాయశిల్పాలు ,కొండపల్లిబొమ్మలు,తోలుబొమ్మలు ,లేపాక్షి హస్తకళలతో కూడిన మరెన్నో వైవిధ్య ఫలితమైన వస్తువులను ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేయడమైందని కళాభిమానులు సాధారణ ప్రజలు అందరూ ఈ స్వర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని హస్త కళాకారులను ప్రోత్సహించవలసిందిగా కోరారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం కళా నైపుణ్యం తో రూపొందించిన హస్త కళాకారుల ఉత్పత్తులను ప్రోత్సహిస్తున్నదని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమిప్రభుత్వం చేనేత, హస్త కళాకారులను లను అనేక విధాలుగా చేస్తున్నట్లు తెలిపారు.ముఖ్యంగా మంగళగిరి నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర విద్య ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ మంగళ గిరి పట్టుచీరలకు చేనేత కుటుంబాలకు గుర్తింపు తెస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం అనంతపురంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ లోవివిధ ప్రాంతాల నుండి హస్త కళాకారులురూపొందించిన17 వివిధ వస్తు సామాగ్రి స్టాళ్లను ముఖ్య అతిథి మార్కెట్ యార్డ్ చైర్పర్సన్ బల్లాపల్లవి సందర్శించి హస్తకళాకారులనుఅభినందించారు.ఈ కార్యక్రమంలో లేపాక్షి డిప్యూటీ మేనేజర్ తిమ్మయ్య, సురేష్ అమర్నాథ్ నాగార్జున, సుహాసిని , పూర్ణిమ హస్త కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనండి..!!

**వార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం (జగన్)**



( నేటి శుభోదయ జులై : 11 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) గాజువాక నియోజకవర్గం 87వ వార్డ్ పరిధిలో ఎస్ ఐ ఆర్ బూత్ లెవెల్ లో నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం జగన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్రాల ప్రవేశపెట్టిన ఎస్ ఐ ఆర్ ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని మన ఇంటికి వచ్చిన బిఎల్ఓ మరియు బిఎల్ఎ లకు సహకరించి వారిచ్చే ఓటర్ పత్రాలను నింపి వారికి అందిస్తే మన ఓటు భద్రంగా ఉంటుందని దీనికి అందరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బొడ్డేటి సత్తిబాబు, మల్లా రాము, బొడ్డేటి దేముళ్ళు, బిఎల్ఓ, బి ఎల్ ఎ, ఆర్ పి లు తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ నగరంలో గల గాజువాక పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించారు.

**– నగర పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి, ఐ.పి.ఎస్.,**



( నేటి శుభోదయ జులై 11 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) గాజువాక పోలీస్ స్టేషన్ ను సందర్శించిన సీపీ పోలీస్ స్టేషన్ మొత్తం నిశితంగా పరిశీలించారు , స్టేషన్ ఆనుకొని ఉన్న ఖాళీ ప్రాంతాలను వ్యర్థాలతో నింపకుండా, ఆయా ఖాళీ ప్రాంతాలను శుభ్రము చేయించాలని ఆదేశించారు, మరుగుదొడ్లను ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచుకోవాలి అనీ ఆదేశించారు, స్టేషన్ నందు ఎల్లవేళలా తగు సిబ్బంది అందుబాటులో ఉండాలనీ ఆదేశించారు, పెండింగ్ కేసులు తక్షణం పరిష్కరించాలని తెలిపారు, అన్ని రిజిస్టర్లు ఎల్లవేళలా అప్డేట్ గా ఉండాలని ఆదేశించారు. అనంతరం స్టేషనుకు ఫిర్యాదులకు వచ్చే ఫిర్యాదుదారులతో స్పందిస్తున్న తీరు తెలుసుకొని , ఫిర్యాదుదారులకు మర్యాద ఇస్తూ వారి సమస్యలను కూర్చోబెట్టి వినాలని, వాటిని పారదర్శకముగా విచారణ చేసి త్వరితగతిన పరిష్కారించాలని తెలిపారు, రౌడీ షీటర్స్, సస్పెక్ట్ షీటర్స్ యొక్క ప్రతి కదలిక ఎల్లవేళలా పరిశీలించాలనీ, గంజాయి రవాణాదారులను అరెస్టు చేయాలనీ, స్టేషన్ల పరిధిలో ఒక్క గంజాయి పెడ్లర్ కూడా ఉండరాదని స్పష్టమైన అదేశాలు జారీ చేశారు, విధులలో ఎటువంటి అధికార దుర్వినియోగానికి పాల్పడినా కఠిన చర్యలు తీసుకోబడతాయనీ కావునా ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదని ఈ సందర్భముగా తెలియ జేశారు .

## పోర్టు పరిసర కాలుష్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి..!!

**– విశాఖ కాలుష్య నియంత్రణపై ఉన్నతస్థాయి సమావేశంలో పాల్గొన్న పల్లా**

**హరితవనం పెంపు, రక్షణ గోడల నిర్మాణంపై పల్లా ప్రత్యేక సూచనలు**

**– అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకూ సమాన ప్రాధాన్యం ఇవ్వాలి**

**లి టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు**



( నేటి శుభోదయ : జులై 11 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) విశాఖ పారిశ్రామిక నగరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజారోగ్య పరిరక్షణతో పాటు కాలుష్య నియంత్రణకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. కలెక్టరేట్లో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రధాన పరిశ్రమల సమీక్ష సమావేశంలో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, గణబాబు, జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, విశాఖలోని 18 ప్రధాన పరిశ్రమల ప్రతినిధులతో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల విశాఖ పోర్టు పరిసర ప్రాంతాల నుంచి బొగ్గు ధూళి, పారిశ్రామిక కాలుష్యంపై ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను సమావేశంలో సవివరంగా చర్చించామని తెలిపారు. పరిశ్రమల అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా సమాన బాధ్యతగా ప్రతి సంస్థ భావించాలని స్పష్టం చేశారు.కేవలం తాత్కాలిక చర్యలతో కాకుండా శాశ్వత పరిష్కారాల దిశగా పరిశ్రమలు అడుగులు వేయాలని పల్లా సూచించారు. బొగ్గు నిల్వలపై టార్పాలిన్లు కప్పడం ఒక్కటే పరిష్కారం కాదని, తరచూ వాటిని తొలగించడం, మళ్లీ కప్పడం వల్ల అవి దెబ్బతినడంతో ఆశించిన ఫలితం ఉండదని సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. అందుకే ప్రతి పరిశ్రమ తన విస్తీర్ణానికి అనుగుణంగా విస్తృతంగా హరితవనాలను అభివృద్ధి చేయడంతో పాటు, కనీసం 20 అడుగుల ఎత్తులో రక్షణ గోడలు నిర్మించి దుమ్ము, బొగ్గు కణాలు బయటకు వ్యాపించకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని సూచించినట్లు వెల్లడించారు.బొగ్గు రవాణాలోనూ నిబంధనలు కచ్చితంగా అమలు కావాల్సిన అవసరం ఉందని పల్లా అన్నారు. లారీలు గరిష్ఠ లోడ్ సామర్థ్యానికి మించి బొగ్గు తరలించరాదని, అధిక లోడింగ్ వల్ల రోడ్లపై బొగ్గు చెల్లాచెదురై కాలుష్యంతో పాటు ప్రమాదాలకు కూడా కారణమవుతోందన్నారు. ప్రతి వాహనంపై తప్పనిసరిగా గ్రీన్ టార్పాలిన్ కప్పి రవాణా చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.కాలుష్య నియంత్రణ విషయంలో పరిశ్రమలు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని, ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు భంగం కలిగించే పరిస్థితులు ఎట్టి పరిస్థితుల్లోనూ పునరావృతం కాకూడదని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. అభివృద్ధి, ఉపాధి కల్పన ఎంత ముఖ్యమో, స్వచ్ఛమైన వాతావరణం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు.సమావేశంలో అధికారులు పరిశ్రమల ప్రతినిధులకు కాలుష్య నియంత్రణకు సంబంధించిన పలు మార్గదర్శకాలు జారీ చేయగా, వాటిని నిర్దిష్ట గడువులో అమలు చేయాలని ఆదేశించారు. విశాఖను పారిశ్రామికంగా అగ్రగామిగా తీర్చిదిద్దడంతో పాటు కాలుష్యరహిత నగరంగా నిలబెట్టేందుకు ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

## వచ్చేది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే

**– ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురంలో "రైతు ఆశీర్వాద సభ"**

**– ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి**

– హాజరైన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, రామసాయం రఘురాం రెడ్డి, బలరాం నాయక్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు- రైతు భరోసా నిధుల విడుదలతో పాటు రైతులకు ఈ-పట్టాదార్ పాస్‌బుక్స్ జారీ చేయనున్న సీఎం. ఖమ్మం "రైతు ఆశీర్వాద సభ"లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



– రాజకీయంగా పాలమూరు నాకు ప్రాణమైతే, ఖమ్మం జిల్లా గుండెకాయ లాంటిది

ఖమ్మం, చింతకాని, నేటి శుభోదయ ::: 2023 జూలై లో పొంగులేటి చేరిక సందర్భంగా ఖమ్మం జిల్లా ప్రజలు ఉప్పెనలా వచ్చి బీఆరెస్ ను బొంద పెట్టారు, సరిగ్గా ఇప్పుడు అదే జూలై లో బీఆరెస్ ను మళ్లీ మొలకెత్తనివ్వమని చింతకాని సభకు వేలాదిగా తరలి వచ్చిన మీకు అభినందనలు అంటూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. 2023 లో ప్రభుత్వ ఏర్పాటు నుంచి ప్రతీ ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వాన్ని గెలిపించి, పాపాల భైరవున్ని ఫామ్ హౌస్ లోనే బందీ చేశారు.జరగబోయే కురుక్షేత్రంలో కౌరవ కల్వకుంట్ల కుటుంబాన్ని రాజకీయ ముఖచిత్రం నుంచి పాతాళానికి తొక్కే వరకు కాంగ్రెస్ కార్యకర్తలు విశ్రమించరు. వచ్చే సాధారణ ఎన్నికలు 2028 డిసెంబరులో జరగవు. 2029 మే లేదా జూన్ మాసంలో జరుగుతాయి. తెలంగాణలో 17 పార్లమెంట్ స్థానాలు 26 కు పెరుగుతాయి. 119 అసెంబ్లీ స్థానాలు 182 కు పెరుగుతాయి.36 నెలల ముందుగానే వచ్చే ఎన్నికల ఫలితాల జోస్యం చెబుతున్నా.182 అసెంబ్లీ స్థానాల్లో 117 సీట్లు గెలిచి రెండోసారి కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది. భద్రాచలం రాములవారి మీద ఆన. ఇది ఖమ్మం కాంగ్రెస్ కార్యకర్తల మాట. రాస్కో చంద్ర శేఖర్ రావు, నీ దొంగ సర్వేలు చేసే దొంగ ఏజెన్సీలు గుర్తు పెట్టుకోండి. ఈ మాట కోసం రోజుకు 18 గంటలు పనిచేస్తాం అని రేవంత్ రెడ్డి అన్నారు. ప్రతీ సందర్భంలో ప్రజా ప్రభుత్వం రైతులను ఆదుకుంటోంది.ఒకరిపై ఒకరికి నమ్మకం లేదు. ఒకే ఇంట్లో రెండు గుంపులు. ఒకరిపై ఒకరు పోటీగా ఒకాయన కన్నెపల్లికి పోయి పంపులు ఆన్ చేయాలంటాడు. ఒకసారి మేడిగడ్డ కుంగితేనే ఇంత నష్టం జరిగింది. మళ్లీ నీళ్లు నింపితే భద్రాచలం రాముడు మునుగుతాడు. ఖమ్మం జిల్లాలో 44 ఊర్లు కొట్టుకుపోయాయి దుర్మార్గుడా.నీ దుష్ట రాజకీయాల కోసం మేడిగడ్డ నింపాలా అని అడిగితే సమాధానం లేదు.రేవంత్ రెడ్డి సర్వేలో కాంగ్రెస్ ఓడిపోతుందని దుష్ప్రచారానికి దిగారు. ఎన్నికలు ఎప్పుడో తెలియకుండా, రిజర్వేషన్లు ఎలా మారుతాయో తెలియకుండా ఎవరైనా సర్వేలు చేస్తారా, గెలుపు ఓటములు నిర్ణయిస్తారా జూబ్లీహిల్స్ లో ఇలాగే చెబితే జనం బీఆరెస్ ను బండకేసి కొట్టారు.బ్యాడుమేళం బ్యాచ్ లా బీఆరెస్ సర్వేల బ్యాచ్ తయారైంది. బీజేపీ లోకి వెళ్ళనని హరీష్ రావును కెసీఆర్ పై ఒట్టేసి చెప్పమను అని సవాల్ చేశారు. నువ్వు ఎక్కడుంటావో తెలియదు. మీ బావ ఎటు పోతాడో తెలియదు.బీఆరెస్ ను బీజేపీ లో విలీనం చేస్తారని నీ సొంత చెల్లెలే చెబుతోంది. ఆంధ్ర కాంట్రాక్టర్లు బీఆరెస్ కి వందల కోట్లు ఇచ్చారని నీ సొంత చెల్లే చెప్పింది.బీఆరెస్ అమలు చేసిన షాది ముబారక్, రైతు బందు పథకాలను మేం కొనసాగించడం లేదా ప్రతీ పేదవాడికి రేషన్ కార్డు, సన్న బియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చాం. రైతు భరోసా 12 వేలకు పెంచాం, రైతు రుణమాఫీ చేసి రుణవిముక్తులను చేశాం. రాబోయే ఎన్నికల్లో తెలంగాణ నుంచి 26 పార్లమెంట్ స్థానాలకు 20 పార్లమెంట్ స్థానాలు గెలిపిద్దాం. రాహుల్ గాంధీని ప్రధాని చేసుకుందాం. భట్టి కోరికమేరకు మధిరకు ఇంజనీరింగ్ కాలేజ్ మంజూరు చేస్తాం. ఔర్ ఏక్ బారా, కాంగ్రెస్ సర్కార్ అంటూ ప్రతిజ్ఞ చేయించారు.

## పెద్దపప్పూరులో అంతర్ జిల్లాల బైక్ దొంగల అరెస్టు

**16 మోటార్ సైకిళ్లు స్వాధీనం**



పెద్దపప్పూరు, జూలై 10 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండల కేంద్రంలో పోలీసులు శుక్రవారం భారీ బైక్ చోరీ ముఠాను పట్టుకున్నారు. ఇద్దరు అంతర్ జిల్లాల మోటార్ సైకిళ్ల దొంగలను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ. లక్షల విలువైన 16 బైకులను స్వాధీనం చేసుకున్నట్లు పెద్దపప్పూర్ సీఐ వై నరేందర్ రెడ్డి, ఎస్సై చంద్రశేఖర్ రెడ్డి వెల్లడించారు. పోలీసుల కథనం మేరకు.. చీమలవాగుపల్లికి చెందిన లోకేష్, తాడిపత్రికి చెందిన సురేష్ అనే ఇద్దరు నిందితులు సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనాలకు అలవాటు పడ్డారు. వీరిద్దరూ కలిసి అనంతపురం, నంద్యాల, కర్నూల్, కర్ణాటకలోని బళ్లారి జిల్లాల పరిధిలో పలుచోట్ల మోటార్ సైకిళ్ల చోరీలకు పాల్పడ్డారు. ఇటీవల ఓ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదును సవాల్‌గా తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ముమ్మర తనిఖీల్లో భాగంగా నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా ఈ చోరీల గుట్టు రట్టయింది. వారి నుంచి దొంగిలించిన 16 బైకులను స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు. చోరీ కేసును ఛేదించిన పోలీస్ సిబ్బందిని ఈ సందర్భంగా ఉన్నతాధికారులు అభినందించారు.

## కనక మహాలక్ష్మి ఆలయ ఏఈగా పద్మావతి నూతన బాధ్యతలు..



( నేటి శుభోదయ జులై : 11 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) విశాఖ, బురుజుపేటలో వెంచేసియున్న శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం యొక్క కార్యనిర్వాహణాదికారిని కే. శోభారాణి వ్యక్తి గత కారణముల దృశ్య 20 రోజులు సెలవుపై వెళ్లినందున స్థానం లో ఎన్.సుజాత ఉపకమిషనర్ విశాఖపట్నం దేవదయశాఖ వారిని నియమిస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల జారిచేసినందున . శుక్రవారం ఉదయం ఎన్. సుజాత కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం కార్యనిర్వాహణా ది కారిణిగా బాధ్యతలు స్వీకరించుట జరిగినది.ముందుగా వీరిచే అమ్మవారికి పూజ నిర్వహింప చేసిన తదుపరి వేద ఆశ్వీర్ వచనం చేసి అమ్మ వారి తీర్ధ, ప్రసాదములు అందజేయుటజరిగినది.ఈ యొక్క కార్యక్రమం లో సహాయ కార్యనిర్వాహణా ది కారి కే. రాజేంద్ర కుమార్, పర్యవేక్షకులు కే. పద్మజ, ఎం. వి. రమణ, బి. అనురాధ, వేదపండితులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.


## కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, పువ్వాడ అజయ్ కుమార్‌లపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అవహేళన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం

**– బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆర్.జె.సి. కృష్ణ**



ఖమ్మం, నేటి శుభోదయ ::: మధిర బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పై చేసిన అవహేళన వ్యాఖ్యలను బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆర్.జె.సి. కృష్ణ తీవ్రంగా ఖండించారు.కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, సంక్షేమం--అభివృద్ధికి బలమైన పునాది వేసిన నాయకుడని, అలాంటి మహానేతను ముఖ్యమంత్రి హోదాలో ఉండి అవమానించడం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని అవమానించడమేనని అన్నారు. తెలంగాణ లేకపోతే నేడు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యే పరిస్థితి ఉండేదా అనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని సూచించారు.కేటీఆర్ హైదరాబాద్‌ను ప్రపంచ ఐటీ మ్యాప్‌పై నిలబెట్టి, తెలంగాణకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చారని పేర్కొన్నారు. హైదరాబాద్ అభివృద్ధి గురించి మాట్లాడే నైతిక అర్హత కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని, నేడు కూడా నగర ప్రజలు కేటీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారని అన్నారు.హరీశ్‌రావు, కేసీఆర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న నాయకుడని అన్నారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై పెరుగుతున్న వ్యతిరేకతను చూసే ఆయనపై పదేపదే విమర్శలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు.మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఖమ్మం జిల్లాకు వేల కోట్ల రూపాయల అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాలు తీసుకువచ్చిన నాయకుడని తెలిపారు. నేడు జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పుకోదగ్గ కొత్త అభివృద్ధి పనులు చూపలేక, పువ్వాడ అజయ్ కుమార్‌పై వ్యక్తిగత విమర్శలకు దిగడం ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.ముఖ్యమంత్రి హోదాలో ఖమ్మం జిల్లాకు వచ్చిన రేవంత్‌రెడ్డి విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతుల సమస్యలు, నిరుద్యోగ యువత, జిల్లాకు కొత్త పరిశ్రమలు, సాగునీటి ప్రాజెక్టులపై మాట్లాడతారని ప్రజలు భావించారని, కానీ ఆయన ప్రసంగమంతా కేసీఆర్ కుటుంబంపై రాజకీయ విమర్శలకే పరిమితమైందని విమర్శించారు.చైతన్యానికి చిరునామా అయిన ఖమ్మం జిల్లా వేదికగా చేసిన ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ రాజకీయ పతనానికి నాంది పలుకుతాయని హెచ్చరించారు. ఇప్పటికైనా వ్యక్తిగత దూషణలు మానుకుని ప్రజల సమస్యల పరిష్కారం, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెట్టాలని రేవంత్‌రెడ్డికి సూచించారు.ఖమ్మం జిల్లా ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, సరైన సమయంలో ప్రజాస్వామ్యబద్ధంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి సమాధానం చెబుతారని ఆర్.జె.సి. కృష్ణ పేర్కొన్నారు.

## పచ్చబొట్టు ఉంటే.. ప్రభుత్వ ఉద్యోగానికి అనర్హులా



( నేటి శుభోదయ జులై : 11విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) పచ్చబొట్టు ఉందన్న కారణంతో ఇద్దరు సీఆర్పీఎఫ్ అధికారుల ప్రమోషన్ను నిలిపివేయడాన్ని దిల్లీ హైకోర్టు సమర్థించింది. ఆర్మీ, పారామిలిటరీ, పోలీస్ వంటి రక్షణ విభాగాల్లో కొత్తగా చేరేవారికీ ఇదే వర్తిస్తుందని స్పష్టం చేసింది. పచ్చబొట్టు వేయించుకోవడం తప్పుకాదని, కానీ అది శరీరంలో ఎక్కడ ఉంది, ఏ పరిమాణంలో ఉందనే అంశాల ఆధారంగానే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి కోర్టు సూచించింది.

# ఏఐ.. మనిషికి సూపర్ పవర్!




భారత్‌లోని ఢిల్లీ వేదికగా జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో కృత్రిమ మేధ ప్రభావంపై తీవ్రంగా చర్చ సాగుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) అనేది ఎన్నటికీ మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయం కాబోదని కొందరు నిపుణులు చెబుతున్నారు. అయితే, ఈ మార్పు క్రమంలో సాంప్రదాయ ఉద్యోగాలకు మాత్రం ముప్పు పొంచి ఉందన్నది కాదనలేని వాస్తవమని ఇంకొందరు వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో అసలు ఏఐ ప్రభావం ఉద్యోగాలపై ఎలా ఉంటుందో, నిపుణులు ఏం అంటున్నారో చూద్దాం.

### సాంప్రదాయ ఉద్యోగాలకు పొంచి ఉన్న ముప్పు

ఏఐ వల్ల పునరావృతమయ్యే పనులు చేసే విభాగాల్లో భారీ మార్పులు వస్తున్నాయి. డేటా ఎంట్రీ, అడ్మినిస్ట్రేషన్ విభాగాల్లో ఆటోమేటెడ్ సాఫ్ట్‌వేర్ల వల్ల క్లరికల్ పనుల అవసరం తగ్గుతోంది. కస్టమర్ సర్వీసులో చాట్‌బాట్స్, ఏఐ వాయిస్ అసిస్టెంట్లు ప్రాథమిక కస్టమర్ సమస్యలను సెకన్లలో పరిష్కరిస్తున్నాయి. ప్రాథమిక స్థాయి సాఫ్ట్‌వేర్ కోడింగ్‌ను ఏఐ మోడల్స్ సమర్థవంతంగా చేస్తున్నాయి. ఫ్యాక్టరీల్లో రోబోటిక్స్ ఏఐ ఏకీకరణ వల్ల మానవ ఆధారిత లేబర్ అవసరం తగ్గుతోంది.

### కొత్త తరం అవకాశాలు

పాత ఉద్యోగాలు పోతున్నా అంతకు రెట్టింపు స్థాయిలో సరికొత్త కెరీర్ మార్గాలు పుట్టుకొస్తున్నాయి. 2026 నాటికి మార్కెట్లో డిమాండ్ ఉన్న విభాగాలు కింది విధంగా ఉన్నాయి. ఏఐ నుంచి సరైన ఫలితాలను రాబట్టే ప్రాంప్ట్ ఇంజినీర్లకు భారీ వేతనాలు లభిస్తున్నాయి. అల్గారిథమ్స్‌లో పక్షపాతం లేకుండా చూసేందుకు ఏఐ ఎథిక్స్ ఆఫీసర్ల అవసరం పెరుగుతోంది. ఏఐ మోడల్స్‌కు శిక్షణ ఇవ్వడానికి అవసరమైన డేటాను ఉపయోగించేందుకు డేటా క్యూరేటర్లకు డిమాండ్ ఉంది. మనుషులు, ఏఐ కలిసి పనిచేసే ప్రక్రియను సమన్వయం చేసే మేనేజర్లకు మార్కెట్‌లో డిమాండ్ ఏర్పడుతోంది.

### ప్రస్తుత పరిస్థితులు: భారత్ సన్నద్ధత

ప్రస్తుతం భారతదేశం 'ఏఐ ఫర్ ఆల్' అనే నినాదంతో ముందుకు వెళ్తోంది. సమ్మిట్‌లో వెల్లడైన వివరాల ప్రకారం భారతీయ కంపెనీలు తమ ఉద్యోగుల కోసం భారీగా 'రీ-స్కిల్లింగ్'(నైపుణ్యాభివృద్ధి) ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తున్నాయి. నైపుణ్యం లేని చోట మాత్రమే ఉపాధి ముప్పు కనిపిస్తోందని, నైపుణ్యం ఉన్న చోట ఉత్పాదకత పెరిగిందని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

### సవాళ్లను అధిగమించడం ఎలా?

**రాబోయే రోజుల్లో ఏఐ విప్లవాన్ని తట్టుకుని నిలబడాలంటే కొన్ని మార్పులు అవసరం.**
**డిగ్రీతో విద్య ముగిసిందని అనుకోకుండా ఎప్పటికప్పుడు కొత్త ఏఐ టూల్స్ నేర్చుకోవాలి.**
**సృజనాత్మకత, క్లిష్టమైన నిర్ణయాలు తీసుకోవడం వంటి పనులను ఏఐ చేయలేదు. వీటిని మెరుగుపరుచుకోవాలి.**
**ప్రభుత్వం ఇండియా ఏఐ మిషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఏఐ అక్షరాస్యతను పెంచేలా చర్యలు తీసుకోవాలి.**
**ఉద్యోగాల కోతను అరికట్టేలా కంపెనీలు సామాజిక బాధ్యతతో ఏఐని అమలు చేయాలి.**

### అసలైన సవాలు..

ఏఐ అనేది మనిషిని తొలగించే సాధనం కాదు, మనిషి సామర్థ్యాన్ని పెంచే ఒక 'సూపర్ పవర్'. సాంకేతికతను చూసి భయపడటం కంటే, దాన్ని మన ఉపాధికి ఎలా వాడుకోవాలో నేర్చుకోవడమే ప్రస్తుతం అసలైన సవాలు.

# కోడ్ నుంచి క్లాడ్ వరకు.. ఆంత్రోపిక్‌తో ఇన్ఫోసిస్ జట్టు




## టెక్ మార్కెట్లో టర్నింగ్ పాయింట్ తయారీ, టెలికం రంగాలకు ఏఐ సొల్యూషన్స్ అభివృద్ధి

న్యూఢిల్లీ: దేశీయంగా టెలికం, ఆర్థిక సేవలు, తయారీ, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ తదితర రంగ సంస్థల కోసం ఎంటర్‌ప్రైజ్ ఏఐ సొల్యూషన్స్‌ని రూపొందించేందుకు, వినియోగంలోకి తెచ్చేందుకు అమెరికన్ ఏఐ సంచలనం ఆంత్రోపిక్‌తో దేశీ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది. దీని కింద క్లాడ్ కోడ్ సహా ఆంత్రోపిక్ క్లాడ్ మోడల్స్‌ని ఇన్ఫోసిస్‌కి చెందిన టొపాజ్ ఏఐ సొల్యూషన్స్‌తో అనుసంధానం చేస్తారు. అలాగే టెలికం రంగ అవసరాల కోసం ఏఐ ఏజెంట్లను తయారు చేసేందుకు ప్రత్యేక ఆంత్రోపిక్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ని ఏర్పాటు చేయనున్నట్లు, తదుపరి ఇతర నియంత్రిత రంగాల్లోకి కూడా విస్తరించనున్నట్లు ఇన్ఫోసిస్ తెలిపింది. క్లెయిమ్స్ ప్రాసెసింగ్, కాంప్లయెన్స్ సమీక్షలు, కోడ్ జనరేషన్, టెస్టింగ్‌లాంటి బహుళ దశలు ఉండే పనులను స్వతంత్రంగా హ్యాండిల్ చేయగలిగే ఏజెంటిక్ ఏఐ సిస్టమ్‌లను రూపొందించడంపై ప్రధానంగా దృష్టి పెట్టనున్నట్లు సీఈవో సలిల్ పరేఖ్ చెప్పారు. వివిధ రంగాల్లో అపార అనుభవం ఉన్న ఇన్ఫీ దెవలపర్లు ఇప్పటికే తమ క్లాడ్ కోడ్‌ని ఉపయోగిస్తున్నట్లు ఆంత్రోపిక్ సీఈవో డేరియో తెలిపారు.

### భారత్‌లో ఆంత్రోపిక్ కార్యాలయం

ఆంత్రోపిక్ దేశీయంగా బెంగళూరులో తమ కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించింది. ఆసియాలో టోక్యో తర్వాత కంపెనీకి ఇది రెండో ఆఫీసు. తమ క్లాడ్.ఏఐ సొల్యూషన్‌కి భారత్ రెండో అతి పెద్ద మార్కెట్ అని కంపెనీ ఇండియా ఎండీ ఇరినా ఘోష్ తెలిపారు. 2025 అక్టోబర్‌లో విస్తరణను ప్రకటించినప్పటి నుంచి భారత్‌లో తమ ఆదాయ వృద్ధి వేగం రెట్టింపయ్యిందని వివరించారు. వివిధ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు స్థానికంగా రిక్రూట్ చేసుకోనున్నట్లు వివరించారు. విద్య, వ్యవసాయం తదితర రంగాల్లో సంస్థలతో భాగస్వామ్యాలను కుదుర్చుకుంటున్నట్లు చెప్పారు. ఆంత్రోపిక్‌తో భాగస్వామ్యం వార్తల నేపథ్యంలో ఇన్ఫోసిస్ షేరు మంగళవారం దాదాపు రెండు శాతం లాభపడింది. బీఎస్ఈలో 1.83 శాతం లాభపడి రూ. 1,391.20 వద్ద క్లోజయ్యింది.


### ఓపెన్‌ఏఐతో ఎటర్నల్ చెట్టాపట్టాల్

వివిధ విభాగాలవ్యాప్తంగా కృత్రిమ మేధ(ఏఐ) వినియోగాన్ని పెంచుకునే దిశగా ఓపెన్‌ఏఐతో భాగస్వామ్య పరిధిని మరింతగా విస్తరించినట్లు ఎటర్నల్ వెల్లడించింది. దీని ప్రకారం జొమాటో, బ్లింకిట్, డిస్ట్రిక్ట్, హైపర్‌ప్యూర్‌తో పాటు తమ భాగస్వామ్య ప్లాట్‌ఫాంలు, అంతర్గత వ్యవస్థల్లో ఏఐ వాడకాన్ని పెంచనుంది. కస్టమర్లు, భాగస్వాములు తమ ప్లాట్‌ఫాంలను మరింత మెరుగ్గా ఉపయోగించుకునేందుకు వీలు కలి?పంచే కొత్త మార్గాలను ఆవిష్కరించేందుకు ఓపెన్‌ఏఐకి చెందిన ఎంటర్‌ప్రైజ్ ఏపీఐ ప్లాట్‌ఫాంతో కలిసి ఎటర్నల్ పని చేయనుంది. అంతర్గతంగా తమ ఆటోమేషన్ ప్లాట్‌ఫాం స్టిచ్‌తో జీపీటీ-5.3-కోడెక్స్‌లాంటి లేటెస్ట్ కోడింగ్ మోడల్స్‌ని అనుసంధానం చేయడంపై దృష్టి పెట్టనుంది.

# హవాయిలో బద్దలైన అగ్నిపర్వతం

## 1,300 అడుగులకు పైగా ఎగసిపడ్డ లావా ఆకట్టుకుంటున్న కళ్లు చెదిరే రాత్రి దృశ్యాలు

**అత్యంత భారీ పరిమాణంలో నిప్పు రవ్వలు వేలాది అడుగుల ఎత్తుకు ఎగసిపడుతుంటే ఎలా ఉంటుంది? ఇదుగో, అచ్చం ఇలాగే ఉంటుంది! హవాయి దీవుల్లో కిలవెయా అగ్నిపర్వతం బద్దలైంది. అందులోంచి లావా ప్రవాహం నిరంతరాయంగా కొనసాగుతోంది. దాని తాలూకు రెండు పాయలు సోమవారం రాత్రి ఫౌంటేన్ మాదిరిగా పైపైకి ఎగజిమ్మాయి. ఒకటి 1,300 అడుగులు, మరొకటి 1,000 అడుగుల చొప్పున పైకి ఎగశాయి. ఆకాశంలో ఎర్రని కాంతులతో చూపరులను కట్టిపడేశాయి. వాటి తాలూకు బూడిదైతే ఏకంగా 35 వేల అడుగుల ఎత్తు దాకా చేరింది! ఈ దృశ్యాలను లక్షలాది మంది ప్రత్యక్షప్రసారం ద్వారా వీక్షించారు. హవాయి నేషనల్ పార్కులోని కిలవెయా ప్రపంచంలో అత్యంత చురుగ్గా ఉన్న అగ్నిపర్వతాల్లో ఒకటి. దాని అడుగున భారీ పగుళ్లున్న కారణంగా మాగ్మా ప్రవాహాలు తరచూ తేలిగ్గా పైకి ఎగదన్నుతూ ఉంటాయి. దాంతో అది పదేపదే బద్దలవుతూ, భారీగా లావాను వెదజల్లుతూ వీక్షకులను ఆకట్టుకుంటూ ఉంటుంది. ముఖ్యంగా గత డిసెంబర్ 23 నుంచీ ఇప్పటిదాకా కిలవెయా పదేపదే బద్దవుతూ, కొన్ని**



**గంటల వ్యవధిలోనే శాంతిస్తూ వస్తోంది. ఈసారి అది 1.5 కోట్ల క్యూబిక్ అడుగుల మేరకు లావాను వెదజల్లి ఉంటుందని అంచనా! అది ఏకంగా 11 వేల ఒలింపిక్ సైజు స్విమ్మింగ్‌పూల్స్‌ను నింపేందుకు సరిపోతుందట!! ఎప్పట్లాగే ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంతో ప్రాణ, ఆస్తినష్టం వంటివేవీ సంభవించలేదు. మూడు వారాల తర్వాత కిలవెయా మరోసారి బద్దలవుతుందని భావిస్తున్నారు.**

# డాక్టర్ ఏఐతో తస్మాత్ జాగ్రత్త!




కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సహాయంతో తమంతట తామే పనిచేసే (ఆటోమేటెడ్ గైడెన్స్) డిజిటల్ యాప్‌లతో పెను ప్రమాదాలే వచ్చి పడుతున్నాయంటూ చాలా ఫిర్యాదులు అందుతున్నాయి. దాంతో అవి చేసే సిఫార్సులు ఒక్కోసారి పెద్దపెద్ద ముప్పులు తెచ్చిపెడుతున్నాయంటూ ప్రముఖ వార్తా సంస్థ 'రాయిటర్స్' హెచ్చరిస్తోంది. ప్రస్తుతం కృత్రిమ మేధ (ఏఐ) కాలూనని రంగమంటూ ఏదీ లేదు. చట్టాలూ, సాఫ్ట్‌వేర్, విద్యా, వినోదంతో పాటు ఆఖరికి లక్షలాది మెడికల్ కేసుల అనుభవంతో వైద్య విద్య, చికిత్సల్లో కూడా అది పాలుపంచుకుంటోంది. ఇక చైనాలాంటి దేశాలైతే ఏఐతో నడిచే క్లినిక్‌లూ, హాస్పిటళ్లు సైతం ఏర్పాటు చేసుకుంటున్నాయి. మిగతా రంగాలెలా ఉన్నప్పటికీ... వైద్యరంగంలో మాత్రం ఏఐతో కొన్ని తప్పులూ, పొరబాట్లు జరుగుతున్నాయనీ, ఇవి ఆందోళన గొలిపేలా ఉన్నాయంటూ డాక్టర్లు, మెడికల్ ప్రొఫెషన్‌లో ఉన్న నిపుణులు బెంబేలెత్తుతున్నారు. ఒకవేళ పేషెంట్లు తమంతట తామే ఏఐకు తమ సమస్య చెప్పుకుని ఆ మేరకు వైద్య సలహా పొందితే అది ఆందోళనకరంగా పరిణమించేందుకు అవకాశాలు లేకపోలేదంటూ హెచ్చరిస్తున్నారు. టర్కీ (తుర్కియా) రాజధాని అంకారాలోని ఒక హాస్పిటల్‌కు వచ్చిన ఒక పేషెంట్ తాలూకు కేస్‌స్టడీతో ఒక సంఘటన వెలుగుచూసింది. అదేమిటంటే... ఆ హాస్పిటల్‌లో పనిచేసే డాక్టర్ సెమ్ అక్సోయ్ అనే డాక్టర్ దగ్గరికి కౌమార వయస్సులో ఉన్న ఓ పద్దెనిమిదేళ్ల పిల్లాడు వచ్చాడు. అతడికి కాలిలో క్యాన్సర్ గడ్డ ఉందని నిర్ధారణ అయ్యాక తన కేసు వివరాలను 'ఏఐ'కి సంబంధించిన చాట్ జీపీటీకి తెలిపి తనకు సలహా ఇవ్వాలంటూ కోరాడు. అంతే... "నువ్వు ఐదేళ్లకు మించి బతకవు" అంటూ ఏఐ సమాధానమిచ్చింది. ఈ సమాచారం ఆ కుర్రాడిని ఎంతగా ఆందోళనపరిచి ఉంటుందో ఎవరైనా ఊహించవచ్చు. కానీ ఓ సర్జికల్ ఆంకాలజిస్టు, ఓ ??లాస్టిక్ సర్జన్ నిర్వహించిన సర్జరీల తర్వాత అతడు పూర్తిగా కోలుకున్నాడు. అంతేకాదు... "ఇప్పుడు నీలోంచి క్యాన్సర్ తొలగిపోయినట్టే" అంటూ భరోసా కూడా ఇచ్చారు. అయితే మళ్లీ అదే అబ్బాయి కొన్ని వారాల తర్వాత డాక్టర్ అక్సోయ్‌కు మరోసారి ఫోన్ చేశాడు. ఈసారి వచ్చిన ఫోన్ సందేశంలోని సందేహమేమిటంటే... "నాకు తరచూ దగ్గు వస్తోంది. అంటే మొన్నటి క్యాన్సర్ ఇప్పుడు ఊపిరితిత్తులకు సోకిందంటారా?" అని అతడు ప్రశ్నించాడు. అయితే డాక్టర్లు అతడి ఊపిరితిత్తులను పూర్తిగా పరీక్షించాక తేలిందేమిటంటే అతడికి క్యాన్సర్ ఏమాత్రం లేదు. అయితే... ఆ పిల్లాడు ఈమధ్య సిగరెట్లు తాగడం మొదలుపెట్టడమే అతడి దగ్గుకు కారణమని తేలింది. "ఏదైనా వ్యాధి నిర్ధారణ చేయాలంటూ కేవలం లక్షణాలను మాత్రమే చూడకూడదు. అతడికి ఆ లక్షణాలు కనిపిస్తున్న సందర్భాలనూ పరిశీలించాలి. ఆ యువకుడు ఇటీవల పొగతాగడం మొదలుపెట్టినందువల్ల దగ్గు వచ్చిందని తేలింది. వైద్యవిజ్ఞాన సమారమంతా ఓ దట్టమైన అడవి అయితే... ఇలా అరకొర పరిజ్ఞానంతో అందులో తిరగడమన్నది దారీతెన్నూ తెలియకుండా అందులో తప్పిపోవడం లాంటిదం"టూ డాక్టర్ అక్సోయ్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా 'ఏఐ' సంస్థలకు సంబంధించిన ఓ ప్రతినిధి మాట్లాడుతూ... "ఇలాంటి అనుభవాల తర్వాత... ఏఐ అడగాల్సిన ప్రశ్నలను నమోదు చేస్తూ కృత్రిమ మేధ మరింత సమర్థంగా, పరిపుష్టంగా పనిచేసేలా మెరుగుపరుస్తున్నామని పేర్కొన్నారు. అయితే కృత్రిమ మేధ ఎప్పటికీ ఓ డాక్టర్ / మెడికల్ ప్రొఫెషనల్‌కు మంచి ప్రత్యామ్నాయం కాబోదంటూ ఆయన తెలిపారు. ఇక్కడ ఈ టర్కిష్ అబ్బాయి ఉదంతం రెండు అంశాలను సూచిస్తోంది. మొదటిది... ప్రపంచంలోని చాలామంది వ్యక్తులు... తాము హాస్పిటళ్ల వరకూ వెళ్లాల్సిన శ్రమ తప్పడం కోసం అలాగే తమ ప్రైవసీని కాపాడుకోవడం కోసం టెక్నాలజీ ఆధారిత సలహాల మీద ఎలా ఆధారపడుతున్నారనే అంశం. ఇక రెండోది... ఏఐ ఆధారిత చాట్‌బాట్‌లు తమకున్న పరిజ్ఞానంతో సమాజాన్ని ఎలా తప్పుదారి పట్టిస్తున్నాయో తెలపడం కోసం ఈ టర్కీ అబ్బాయి ఉదంతమే ఒక తార్కాణం.




### మేర దాటుతున్న మేధ...

ఈ నేపథ్యంలో చూసినప్పుడు కొన్ని మెడికల్ యాప్స్ తమ నైతిక పరిధులను దాటుతున్నాయి. ఉదాహరణకు 'యురేకా హెల్త్' అనే ఓ యాప్ తనను తాను "ఆల్ ఇన్ వన్ హెల్త్ కంపేనియన్'గా ప్రకటించుకుంది. అంటే... ఆరోగ్యం విషయంలో అన్ని వ్యాధుల నిపుణుడూ తానే అయిపోయి ఆరోగ్య సమాచారాన్ని తెలుపుతానంటూ గొప్పలు చెప్పుకుంటోంది. అయితే ఆపిల్ యాప్ స్టోర్ మాత్రం కొంత సంయమనం పాటిస్తూ... "ఇది కేవలం తగిన సమాచారాన్ని తెలుసుకోవడం కోసం మాత్రమే. తాను వ్యాధి నిర్ధారణగానీ లేదా చికిత్సగానీ చేయడానికి తగనం"టూ" స్పష్టం చేస్తోంది. కానీ దాన్ని అభివృద్ధి చేసిన సంస్థవాళ్లు మాత్రం 'మీకు మీరే మీ డాక్టర్' అంటూ ప్రచారాలు చేసేస్తున్నారు. అలాగే "అస్క్, డయాగ్నోజ్, ట్రీట్" అనే మరో సైట్ వాళ్లు మరికాస్త ముందుకెళ్లి "మా ఐఏ వ్యాధి నిర్ధారణా చేసేస్తుంది. వాడాల్సిన మందుల్ని సూచిస్తూ ప్రిస్క్రిప్షన్ కూడా రాసేస్తుంది. ఈ ప్రపంచంలోని హాస్పిటల్స్‌లో వాస్తవంగా మీకు ఎలాంటి చికిత్స దొరుకుతుందో దాన్ని ఇక్కడే మీకు సూచిస్తుంది" అంటూ గొప్పలకు పోతున్నారు. అయితే... రాయిటర్స్ సంస్థలో వచ్చిన వార్తల వల్ల... "యురేకా హెల్త్" యాప్ కారణంగా జరిగిన అనర్థాలను తెలుసుకున్న తర్వాత 'ఆపిల్' సంస్థ సదరు యాప్‌ను తమ స్టోర్‌నుంచి తొలగించింది. అంతే కాదు... ఏ సమాచారం ఆధారంగా; ఏ పద్ధతుల ద్వారా; ఏయే అంశాల సహాయంతో వ్యాధి నిర్ధారణ విషయంలో ఆ నిర్ధారణకు వస్తున్నారో స్పష్టంగా తెలపాలంటూ యాప్‌ను అభివృద్ధి చేసే నిపుణులకు స్పష్టమైన సూచనలు చేసింది.

### మెడికల్ యాప్స్!

ఇటీవల కృత్రిమమేధ (ఏఐ) సహాయంతో గూగుల్ లేదా ఆపిల్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే మెడికల్ యాప్‌ల సంఖ్య బాగా పెరిగింది. నిజానికి అవి ఎలాంటి వ్యాధి నిర్ధారణా చేయకూడదు. అయినప్పటికీ వాటిని ఆశ్రయించి... తమ సమస్య ఏమిటో తెలుసుకోవడమన్నది చాలా ఎక్కువైంది. అయితే ఇక్కడ ఒక చిక్కుముడి ఉంది. నిజానికి ఏఐ ఎలాంటి వ్యాధినిర్ధారణా (డయాగ్నోజ్) చేయకూడదు. కానీ యూఎస్ ఎఫ్‌డీఏ (ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్) సంస్థ నియమాల ప్రకారం... ప్రజల ప్రాథమిక అవగాహన కోసమే సమాచారం తెలిపే సందర్భాల్లో ఆ చాట్‌బాట్‌లు ఎవరి అనుమతులూ తీసుకోనక్కర్లేదు. అందుకోసమే "తాము డాక్టర్‌కు ప్రత్యామ్నాయం కానేకాదనీ,వ్యాధిని నిర్ణయించడంలో విషయంలో తాము చేసేది 'తుది నిర్ధారణ' కాదం"టూ స్పష్టంగా సూచన (డిస్క్లెజి?లయిమర్) చేస్తుంటాయి.

# బ్లాక్ శారీలో సన్నని న డుము.. అందాల జ్యోతి స్టన్నింగ్ లుక్

**గ్లామర్ వరల్డ్ లో ఎంతోమంది అప్సరసల నడుమ పోటీని తట్టుకోవడం అంత చిన్న విషయం కాదు.**





గ్లామర్ వరల్డ్ లో ఎంతోమంది అప్సరసల నడుమ పోటీని తట్టుకోవడం అంత చిన్న విషయం కాదు. ఇక వారిలో ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న జ్యోతి పూర్వాజ్, తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. బ్లాక్ ట్రాన్స్‌పరెంట్ శారీలో ఆమె కనిపిస్తున్న తీరు చూస్తుంటే, ట్రెడిషనల్ వేర్‌లో కూడా గ్లామర్‌ను ఎలా ఎలివేట్ చేయాలో ఆమెకు బాగా తెలుసనిపిస్తోంది. అతిగా చేయకుండా, కేవలం తన చూపులతోనే కుర్రకారును ఆకట్టుకుంటోంది. ఈ లేటెస్ట్ ఫోటోషూట్ ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఈ ఫోటోల్లో జ్యోతి తన నేచురల్ బ్యూటీని చాలా చక్కగా ప్రజెంట్ చేసింది. విరబోసిన జుట్టు, సింపుల్ మేకప్, మెడపై ఉన్న చిన్న టాటూ ఆమె లుక్‌కు ఒక మోడ్రన్ టచ్ ఇచ్చాయి. ముఖ్యంగా కెమెరా వైపు చూస్తూ ఆమె ఇస్తున్న స్టైల్ ఫోటోలకు మరింత అందాన్ని తీసుకొచ్చింది. నేటి జనరేషన్ ఫ్యాషన్ ట్రెండ్స్‌ను ఫాలో అవుతూనే, శారీ కట్టులో ఉండే ఆ హుందాతనాన్ని ఎక్కడా తగ్గకుండా చూసుకుంది. డీసెంట్ అప్పీల్‌తోనే గ్లామర్ డోస్ పెంచవచ్చని ఈ క్లిక్స్‌తో నిరూపించింది. జ్యోతి పూర్వాజ్ కెరీర్ విషయానికి వస్తే, ఆమె ప్రయాణం చాలా బలన్స్‌గా సాగుతోంది. బుల్లితెరపై నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆమె, ఆ తర్వాత వెండితెరపై కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకుంది. వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ తన నటనతో ఆడియన్స్‌ను అలరిస్తోంది. కేవలం గ్లామర్ రోల్స్ మాత్రమే కాకుండా, పెర్ఫార్మెన్స్‌కు స్కోప్ ఉన్న పాత్రలు చేయడానికే ఆమె ప్రాధాన్యత ఇస్తోంది దస్ట్రీలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా, తనకంటూ ఒక ఇమేజ్‌ను క్రియేట్ చేసుకోవడంలో ఆమె సక్సెస్ అయింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో జ్యోతికి మిలియన్ల కొద్దీ ఫాలోయింగ్ ఉంది. ఆమె షేర్ చేసే ప్రతి ఫోటో కూడా సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. నటిగానే కాకుండా ఒక ఫ్యాషన్ ఐకాన్‌గా కూడా ఆమె ఎదుగుతోంది. ఫిట్‌నెస్ విషయంలో ఆమె తీసుకుంటున్న జాగ్రత్తలు ఈ లేటెస్ట్ ఫోటోషూట్‌లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. తన లుక్స్‌తో ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని చూపిస్తూ ఫ్యాన్స్‌ను థ్రిల్ చేస్తోంది. ముఖ్యంగా యువతలో ఆమెకు ఉన్న క్రేజ్ ఈ మధ్య కాలంలో బాగా పెరిగింది. మరి అమ్మడు ఈ గ్లామర్ తో ఎలాంటి ఆఫర్లు అందుకుంటుందో చూడాలి.

# ఆ బయోపిక్ లో సాయి పల్లవి తప్ప మరో ఆప్షనే లేదట!



భారతీయ సంగీత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన గాన కోకిల ఎం.ఎస్ సుబ్బులక్ష్మి బయోపిక్‌పై ఇండస్ట్రీలో మళ్లీ చర్చలు వేడెక్కుతున్నాయి. ముఖ్యంగా ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా సాయి పల్లవిని ఫైనల్ చేసినట్టు వస్తున్న సమాచారం ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. మధ్యలో పలు పేర్లు వినిపించినప్పటికీ, మేకర్స్ మాత్రం సాయి పల్లవిని తప్ప మరెవరినీ ఈ పాత్ర కోసం పరిగణనలోకి తీసుకోవడంలేదని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాతలు బన్నీ వాస్, రాక్‌లైన్ వెంకటేష్ సంయుక్తంగా నిర్మించనున్నారని సమాచారం. ఇటీవల ఈ బయోపిక్ నుంచి సాయి పల్లవి తప్పుకుందనే వార్తలు, అలాగే ఆమె స్థానంలో రుక్మిణి వసంత్‌ను తీసుకున్నారనే ప్రచారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. అయితే ఈ వార్తలన్నింటినీ మేకర్స్ పూర్తిగా ఖండించినట్టు తెలుస్తోంది. ఎం.ఎస్ సుబ్బులక్ష్మి లాంటి గొప్ప వ్యక్తిత్వాన్ని తెరపై ప్రతిబింబించాలంటే సాయి పల్లవి లాంటి నటి అవసరమని టీమ్ గట్టిగా నమ్ముతోందట. ఆమె నటనలో ఉన్న సహజత్వం, క్లాసికల్ లుక్, డెడికేషన్ లాంటి క్వాలిటీస్ ఆమెను ప్రత్యేకంగా నిలబెడతాయని భావిస్తున్నారు. అందుకే ఈ ప్రాజెక్ట్‌లో ఆమెనే కొనసాగిస్తున్నామని స్పష్టం చేసినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమా అక్టోబర్ 2026 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని తెలుస్తోంది. మొదట ఈ సినిమా త్వరగా స్టార్ట్ అవుతుందని భావించినప్పటికీ, సాయి పల్లవి ఇతర ప్రాజెక్టులతో బిజీగా ఉండటం వల్ల షూటింగ్ షెడ్యూల్‌ను వాయిదా వేసినట్టు టాక్ వినిపిస్తోంది. ఇదే సమయంలో, ఈ పాత్ర కోసం సాయి పల్లవి ప్రత్యేకంగా కర్ణాటక సంగీతంలో శిక్షణ తీసుకుంటోందన్న సమాచారం కూడా సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమా అక్టోబర్ 2026 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని తెలుస్తోంది. మొదట ఈ సినిమా త్వరగా స్టార్ట్ అవుతుందని భావించినప్పటికీ, సాయి పల్లవి ఇతర ప్రాజెక్టులతో బిజీగా ఉండటం వల్ల షూటింగ్ షెడ్యూల్‌ను వాయిదా వేసినట్టు టాక్ వినిపిస్తోంది. ఈ పాత్ర కోసం సాయి పల్లవి ప్రత్యేకంగా కర్ణాటక సంగీతంలో శిక్షణ తీసుకుంటోందన్న సమాచారం కూడా సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి ఈ బయోపిక్‌ను తెరకెక్కించనుండటం ఈ ప్రాజెక్ట్‌కు మరో బలంగా మారింది. జెర్సీ వంటి భావోద్వేగభరితమైన సినిమాతో తన కథన శైలిని నిరూపించుకున్న ఆయన, ఎం.ఎస్ సుబ్బులక్ష్మి జీవితాన్ని కూడా అదే స్థాయిలో ఎమోషనల్ గా, నిజాయితీగా చూపిస్తాడనే నమ్మకం ప్రేక్షకుల్లో ఉంది. ఇక సంగీత దర్శకుడు అనిరుధ్ ఈ సినిమాకు సంగీతం అందించనుండటం కూడా ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఒక గొప్ప సంగీత విద్వాంసురాలి జీవితం నేపథ్యంలో తెరకెక్కుతున్న సినిమా కావడంతో మ్యూజిక్ ఈ ప్రాజెక్ట్‌లో కీలక పాత్ర పోషించనుంది. మొత్తానికి, సాయి పల్లవి లాంటి ప్రతిభావంతమైన నటి ఈ బయోపిక్‌లో ప్రధాన పాత్ర పోషించడం, గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం, అనిరుధ్ సంగీతం ఇవన్నీ కలిసివచ్చి ఈ ప్రాజెక్ట్‌ను అత్యంత ఆసక్తికరంగా మార్చుతున్నాయి. అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తుండగా, త్వరలోనే మేకర్స్ నుంచి క్లారిటీ వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.



# వారణాసి తర్వాత మహేష్ ప్లాన్ అదే!



**ఇదిలా ఉంటే వారణాసి తర్వాత మహేష్ బాబు ప్లాన్స్ మరింత యాంబీషస్‌గా కనిపిస్తున్నాయి.**

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు కెరీర్‌లో కీలక మలుపు తిరిగే ప్రాజెక్ట్‌గా వారణాసి నిలవబోతోందనే అంచనాలు ఇండస్ట్రీలో బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటి వరకు పూర్తి స్థాయి పాన్ ఇండియా మార్కెట్‌ను టార్గెట్ చేయని మహేష్, ఈ సినిమాతో తన ఇమేజ్‌ను నేషనల్ నుంచి గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లాలని చూస్తున్నారు. ముఖ్యంగా రాజమౌళి దర్శకత్వం ఈ ప్రాజెక్ట్‌కు భారీ క్రేజ్‌ను తెచ్చిపెడుతోంది. రాజమౌళి సినిమాలకు ఉన్న అంతర్జాతీయ గుర్తింపు దృష్ట్యా, వారణాసి మహేష్ బాబుకు కేవలం సినిమా కాకుండా ఒక కెరీర్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్ట్‌గా మారే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. స్టార్ హీరో సంచలన నిర్ణయం! గుంటూరు కారం తర్వాత మూడేళ్ల గ్యాప్ అయితే ఈ జర్నీలో మహేష్ కెరీర్లో మూడేళ్ల గ్యాప్ వచ్చింది. గుంటూరు కారం తర్వాత మహేష్ నుంచి ఇంత పెద్ద గ్యాప్ తీసుకోవడం రిస్క్‌గా కనిపించినా, తర్వాత వస్తుంది రాజమౌళి సినిమా కాబట్టి అది తన మార్కెట్ ను, క్రేజ్ ను, ఫాలోయింగ్ ను పెంచుతుందే తప్పించి ఏ మాత్రం రిస్క్ అనుకోవడానికి లేదు. రాజమౌళి ప్రాజెక్ట్స్‌కు సహజంగానే ఎక్కువ సమయం పడుతుండటంతో, ఈ గ్యాప్‌ను ఫ్యాన్స్ కూడా అంగీకరిస్తున్నారు. అంతేకాదు, సినిమా రిలీజ్ అయ్యే సమయానికి ఈ వెయిటింగ్ పీరియడ్ మరింత ఎక్స్‌పెక్టేషన్స్‌ను పెంచే ఫ్యాక్టర్‌గా మారవచ్చు. ాాంజవతీఅంవఎవత్ మూడేళ్లలో మూడు సినిమాలు ఇదిలా ఉంటే వారణాసి తర్వాత మహేష్ బాబు ప్లాన్స్ మరింత యాంబీషస్‌గా కనిపిస్తున్నాయి. మూడేళ్లలో మూడు సినిమాలు రిలీజ్ చేయాలనే టార్గెట్ తో ఆయన ముందుకెళ్తున్నట్టు టాక్. ఇది కేవలం బిజీ షెడ్యూల్ మాత్రమే కాకుండా, మార్కెట్‌ను నిరంతరం యాక్టివ్‌గా ఉంచే వ్యూహంగా భావిస్తున్నారు. వారణాసి తర్వాత మహేష్ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ లో ఓ ప్రాజెక్ట్, అలాగే ఏషియన్ సునీల్ తో మరో సినిమా చర్చల్లో ఉండటం



గమనార్హం. ఒకేసారి పలు ప్రాజెక్టులను ప్లాన్ చేయడం ద్వారా గ్యాప్‌లను తగ్గించడమే కాకుండా, విభిన్న జానర్లతో ఆడియన్స్‌ను ఆకట్టుకోవాలని మహేష్ ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. అయితే ఈ ప్రాజెక్టులకు ఎవరు దర్శకత్వం వహిస్తారనేది ఇంకా ఫైనల్ కాకపోవడం ఆసక్తిని పెంచుతోంది. - రూ.3000 కోట్ల డైరెక్టర్‌పై కన్నేసిన టాలీవుడ్ హీరో డిమాండ్ ఇక రెమ్యునరేషన్ అంశం కూడా ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. వారణాసి తర్వాత పెరిగే మార్కెట్ ను దృష్టిలో ఉంచుకుని ఆయన భారీ పారితోషికం డిమాండ్ చేస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. వారణాసి సక్సెస్ అయితే, ఆయన మార్కెట్ విలువ భారీగా పెరిగే అవకాశం ఉండటంతో, ఈ హైక్ నిర్మాతలపై బడ్జెట్ ప్రెజర్‌ను పెంచే అవకాశముంది. ఇదే సమయంలో, స్టార్ మార్కెట్ పెరిగితే రికవరీ కూడా అదే స్థాయిలో ఉండే అవకాశం ఉండటంతో, నిర్మాతలు కూడా ఈ రిస్క్‌ను అంగీకరించడానికి అవకాశాలున్నాయి. . ఒక్కసారే భోజనం అయితే ఈ మొత్తం ప్లాన్‌లో అత్యంత కీలకమైంది రాజమౌళితో సినిమా చేసిన తర్వాత వచ్చే ప్రాజెక్టులపై భారీ అంచనాలు ఏర్పడటం సహజం. గతంలో పలువురు స్టార్ హీరోలు ఈ ప్రెజర్‌ను ఫేస్ చేసినప్పటికీ, వాళ్లలో ఎక్కువ మంది ఫ్లాపులనే ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో మహేష్ తర్వాతి ప్రాజెక్టులు, వాటి ఎంపికపై మరింత జాగ్రత్త వహించాల్సిన అవసరముందని అంతా అభిప్రాయపడుతున్నారు. మరో వైపు మార్కెట్ ఎక్స్‌పాన్షన్ విషయంలో కూడా మహేష్ బాబు స్పష్టమైన వ్యూహంతో ముందుకెళ్తున్నట్టు తెలుస్తోంది. వారణాసి తర్వాత నార్త్ ఇండియా మరియు ఓవర్సీస్ మార్కెట్లపై ఫోకస్ పెంచే అవకాశం ఉంది. రాజమౌళి బ్రాండ్ వల్ల వచ్చే విజిబిలిటీని ఉపయోగించుకుని, తన తర్వాతి సినిమాలను కూడా పాన్ ఇండియా లెవల్‌లో ప్లాన్ చేసే అవకాశమున్నట్టు తెలుస్తోంది. మొత్తంగా చూస్తే, వారణాసి మహేష్ బాబు కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలవడమే కాకుండా, ఆయన భవిష్యత్ దిశను నిర్ణయించే కీలక ప్రాజెక్ట్‌గా మారనుంది.

# అల్లరి నరేష్ ఫిట్‌నెస్ సీక్రెట్.. ఒక్కసారే భోజనం



**టాలీవుడ్ సీనియర్ హీరో అల్లరి నరేష్ తన కామెడీతోనే కాదు, తన లీన్ ఫిజిక్‌తోనూ అందరినీ ఆశ్చర్యపరుస్తుంటారు.**

టాలీవుడ్ సీనియర్ హీరో అల్లరి నరేష్ తన కామెడీతోనే కాదు, తన లీన్ ఫిజిక్‌తోనూ అందరినీ ఆశ్చర్యపరుస్తుంటారు. ఇన్నేళ్లయినా ఆయన బాడీ షేప్ ఏమాత్రం మారకపోవడం వెనుక ఒక కఠినమైన డైట్ ప్లాన్ ఉంది. రోజుకు కేవలం ఒక్క పూట మాత్రమే భోజనం చేసే పద్ధతిని ఆయన పాటిస్తున్నారు. ఆహారంపై పెద్దగా ఆకర్షణ లేకపోవడమే తన ఫిట్‌నెస్ రహస్యమని, లీన్ బాడీని మెయింటైన్ చేయడం కోసమే ఈ క్రమశిక్షణతో ఉన్నానని ఆయన వెల్లడించారు. ఆ వివరాలు చూద్దాం.. స్టార్ హీరో సంచలన నిర్ణయం! రోజుకు ఒక్క పూటే భోజనం: అల్లరి నరేష్ ఫిట్‌నెస్ విషయంలో చాలా స్ట్రిక్ట్. ఆయన రోజుకు ఒకేసారి హుందాగా భోజనం చేస్తారు. అంటే మధ్యాహ్నం లంచ్ చేస్తే, రాత్రి డిన్నర్ చేయరు. ఒకవేళ రాత్రికి ప్లాన్ ఉంటే మధ్యాహ్నం స్కిప్ చేస్తారు. ఇలా చేయడం వల్ల బాడీలో అనవసరమైన ఫ్యాట్ చేరకుండా ఉంటుందని ఆయన నమ్ముతారు. దాదాపు 90 శాతం సమయం ఆయన ఇదే పద్ధతిని ఫాలో అవుతూ తన బరువును అదుపులో ఉంచుకుంటారు. జ్యూస్‌లకు, కొబ్బరి నీళ్లకు దూరం చాలామంది ఫిట్‌నెస్ కోసం జ్యూస్‌లు, కొబ్బరి నీళ్లు వంటివి ఎక్కువగా తీసుకుంటుంటారు. కానీ నరేష్ మాత్రం వీటికి దూరంగా ఉంటారట. ఆయనకు ఆహారం పట్ల అంతగా క్రేజ్ లేకపోవడం కూడా ఒక ప్లస్ పాయింట్ అని చెప్పాలి. కేవలం తనకు అవసరమైన పోషకాలు అందేలా ఒకే పూట తింటూ, మిగతా సమయమంతా చాలా తక్కువ క్యాలరీలతో సరిపెట్టుకుంటారు. దీనివల్ల ఆయన ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటారు. వర్కౌట్స్ అంటే ఇలా ఉండాలి: కేవలం డైట్ మాత్రమే కాదు, వర్కౌట్స్ విషయంలోనూ నరేష్ తనదైన స్టైల్ ఫాలో అవుతారు. సిక్స్ ప్యాక్ లేదా పర్ఫెక్ట్ బాడీ షేప్ కోసం ర్యాంకింగ్ లెగ్ రైజెస్, బ్యాక్ ఎక్స్‌టెన్షన్స్ వంటి వ్యాయామాలు చేస్తారు. కండలు పెంచి బాడీని బల్క్ చేయకుండా, ఎప్పుడూ లీన్ గా ఉండటానికే ఆయన ప్రాధాన్యత ఇస్తారు. అందుకే ఆయన ఏ రోల్‌లో నటించినా ఆ పాత్రకు త్వరగా సెట్ అయిపోతారు. వరుస సినిమాలతో బిజీ: నరేష్ ప్రస్తుతం కెరీర్ పరంగా ఫుల్ జోష్‌లో ఉన్నారు. ప్రదీప్ మద్దాలి దర్శకత్వంలో "కనక దుర్గ" అనే డివోషనల్ యాక్షన్ డ్రామాలో నటిస్తున్నారు. ఇది కాకుండా, మే 29న "ఆల్కహాల్" అనే సినిమాతో మన ముందుకు రాబోతున్నారు. ఇందులో రుహానీ శర్మ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఒక నటుడిగా నిలదొక్కుకోవాలంటే టాలెంట్‌తో పాటు ఫిట్‌నెస్ కూడా చాలా ముఖ్యం. అల్లరి నరేష్ పాటిస్తున్న ఈ 'వన్ మీల్ ఏ డే' పద్ధతి అందరికీ సాధ్యం కాకపోయినా, ఆయన చూపిస్తున్న క్రమశిక్షణ మాత్రం అభినందనీయం. కంటెంట్ ఉన్న కథలను ఎంచుకుంటూనే, తన హెల్త్ విషయంలో ఇంత కేర్ తీసుకోవడం వల్లే ఆయన సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ అదరగొడుతున్నారు. ఇక మరి ఆయన రాబోయే సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటాయో చూడాలి!

# 'మైసా' కోసం రష్మిక రిస్క్.. 80 అడుగుల ఎత్తు నుంచి జంప్




పాత్ర కోసం ఎంత రిస్క్ అయినా తీసుకునే కథానాయికల్లో రష్మిక ముందు వరుసలో ఉంటారు. తాజాగా ఆమె మరోసారి నటనపై తనకున్న నిబద్ధతను చాటుకున్నారు. తాను నటిస్తోన్న 'మైసా' కోసం మునుపెన్నడూ లేనివిధంగా కష్టపడుతున్నారు. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రంలో రష్మిక గోండు తెగకు చెందిన మహిళగా కనిపించనున్నారు. ఈ సినిమా కోసం ఆమె చేసిన సవాలుతో కూడిన స్టంట్స్ గురించి 'మైసా' డైరెక్టర్ రవీంద్ర పుల్లె తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. "రష్మిక పోషిస్తున్న పాత్ర పేరు 'మైసా'. చాలా ప్రభావవంతమైన పాత్ర. ఆమె ప్రదర్శించే కోపం, ఆవేశం ఈ సినిమాకు హైలైట్. ఇటీవలే కేరళలోని అతిరపల్లి జలపాతం వద్ద ఒక క్లిష్టమైన యాక్షన్ సీన్ చిత్రీకరించాం. రష్మిక డూప్ లేకుండా 80 అడుగుల ఎత్తు నుంచి దూకారు. ఆ సమయంలో ఆమె చేతులకు, కాళ్లకు గాయాలయ్యాయి. అయినా విరామం తీసుకోకుండా షూటింగ్‌లో పాల్గొన్నారు. ఆమె నిబద్ధత చూసి చిత్రబృందమంతా ఆశ్చర్యపోయింది" అని తెలిపారు. ఈ చిత్రం కోసం అంతర్జాతీయ స్టంట్ కొరియోగ్రాఫర్ కెచా ఖంపక్డీ ఆధ్వర్యంలో రష్మిక శిక్షణ పొందినట్లు డైరెక్టర్ వెల్లడించారు. బ్యాంకాక్‌లో వారం రోజుల పాటు ప్రతిరోజూ 8 గంటల పాటు కఠినమైన యుద్ధ విద్యలను నేర్చుకున్నట్లు తెలిపారు. మార్షల్ ఆర్ట్స్, గిరిజన పోరాట పద్ధతులను కలిపి ఈ సినిమా కోసం ఓ కొత్తతరహా యాక్షన్ శైలిని డిజైన్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.



NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .